
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం 20 ఫిబ్రవరి 2024



## ఎన్నికల విధులు సమర్థంగా నిర్వహించాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని రకాల ప్రభుత్వ ఎన్నికల ఏజెన్సీలు నిర్దేశిత నిబంధనలు ఆకళింపు చేసుకుని విధులను సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం ఎన్నికల నోడల్ అధికారులతో ఆయన, ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వరరెడ్డితో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించిన తేదీ నుంచి ఏజెన్సీలు చురుకుగా పని చేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, బ్యాంకులలో నగదు లావాదేవీలు, ఎన్నికలలో ప్రలోభ పరిచే వస్తువుల రవాణా తదితర అంశాలపై దృష్టి పెట్టాలన్నారు.



'దేనికి సిద్ధం.. అరాచకానికా!? దౌర్జన్యాలకా!?. ఉద్దేశ పూర్వకంగానే దాడులు జరుగుతున్నాయి. సాక్షాత్తు సీఎం జగన్ పాల్గొన్న సభలోనే ఓ ఫొటో జర్నలిస్టుపై దాడి జరిగిందంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటి? ఇందుకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా కఠినంగా వ్యవహరించాలి.' అంటూ విపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేశాయి. అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన ఘటనపై రాజకీయ నాయకులతోపాటు జర్నలిస్టులూ భగ్గుమన్నారు. సోమవారం జిల్లావ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. దాడికి కారుకులైన వారిని అరెస్ట్ చేయడంతోపాటు కఠినంగా వ్యవహరించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

# సిద్ధం అరాచకానికా.. దౌర్జన్యానికా!?

- 'రాప్తాడు' ఘటనపై పెల్లుబికిన నిరసన
- వైసీపీ మూకల దాడికి నిరసనగా దద్దరిల్లిన జిల్లా
- ఉద్యమించిన మీడియా, పాత్రికేయ సంఘాలు
- సంఘీభావం తెలిపిన విపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు

నెల్లూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన 'సిద్ధం' సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు జరిపిన దాడికి జిల్లావ్యాప్తంగా ఆందోళనలు మిన్నుముట్టాయి. జర్నలిస్టు సంఘాలు, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు రాప్తాడు ఘటనను తీవ్రంగా ఖండించాయి. వైసీపీ రాక్షస పాలనకు పరాకాష్ఠగా ఈ దాడిని ఉదహరించాయి. రోడ్లెక్కి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశాయి. ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసనను వ్యక్తం చేశాయి. నెల్లూరు నగరంలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో గాంధీబొమ్మ వద్ద నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి కొన్ని పత్రికలు, చానెళ్లపై కక్షగట్టి దాడులు చేయిస్తోందని మండిపడ్డారు. జర్నలిస్టులను అణగ దొక్కాలని, పత్రికా స్వేచ్ఛను హరించాలని ప్రయత్నించిన ఏ ప్రభుత్వమూ, ఏ నాయకుడు ప్రజాస్వామ్యంలో మనుగడ సాధించలేదని గుర్తు చేశారు.

- నెల్లూరు రూరల్ మండలం జొన్నవాడ సర్కిల్ వద్ద సీపీఐ, సీపీఎం నాయకులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం సభలోనే విలేకరుల మీద దాడి జరగడం సిగ్గుచేటన్నారు.
- కావలిలో గాంధీ విగ్రహం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు జర్నలిస్టులు ర్యాలీ నిర్వహించారు. ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వైసీపీ మూకలను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు.
- కొండాపురంలో జర్నలిస్టులు తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. బిట్రగుంటలో టీడీపీ నేతలు అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో నిరసన ప్రదర్శన చేశారు. బోగోలులో టీడీపీ నాయకులు నల్ల రిబ్బన్లు ధరించి గళం విప్పారు. దుత్తలూరులో టీడీపీ నాయకులు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు.
- కందుకూరులో జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. అల్లరి మూకలను అరెస్టు చేయాలని సబ్ కలెక్టర్, డీఎస్పీలకు వినతి పత్రాలు సమర్పించారు. కందుకూరు టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు, సీపీఐ కార్యదర్శి బూసి సురేష్‌బాబు తదితరులు ఈ ఘటనను ఖండిస్తూ ప్రకటనలు విడుదల చేశారు. ఉలవపాడు, గుడ్లూరులలోనూ విలేకరులు తహసీల్దారుకు వినతిపత్రాలు అందజేశారు.
- కోవూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి జర్నలిస్టులకు సంఘీభావంగా విడవలూరులో ర్యాలీ నిర్వహించారు. ఇందుకూరుపేటలో జర్నలిస్టుల ఆందోళనకు జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్ సంఘీభావం తెలిపారు. ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని ఖండించారు. టీపీ గూడూరులో టీడీపీ, జనసేన నాయకులు తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు.



నెల్లూరులోని గాంధీబొమ్మ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు



కందుకూరులో డీఎస్పీకి వినతి



నెల్లూరు రూరల్ మండలం జొన్నవాడ క్రాస్ వద్ద సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వామపక్ష నాయకులు

### జగన్ పిలుపుతోనే...



ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై దాడి ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ. చొక్కాలు మడత పెట్టమని సీఎం జగన్ ఇచ్చిన పిలుపుతో రెచ్చిపోతున్న వైసీపీ మూకలు అమాయకుల చొక్కాలను రక్తంతో తడుపుతున్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి సభలో శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడం దేనికి సంకేతం. ఇందుకు పూర్తి బాధ్యత జగనే వహించి, బాధ్యులను అరెస్టు చేయించాలి. మీడియాకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను సైతం ప్రభుత్వం హరిస్తోంది.

- బీద రవిచంద్ర, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

### వైసీపీ అరాచకాలకు పరాకాష్ఠ



సీఎం జగన్మోహన్ రెడ్డితో పాటు వైసీపీ నేతల్లో ఓటమి భయంతో కూడిన ఫ్రస్ట్రేషన్ పీక్‌కు చేరింది. అందులో భాగమే దాడికి తెగబడ్డారు. వైసీపీ ప్రభుత్వానికి భారత రాజ్యాంగం అంటే పూర్తిగా లెక్కలేదు. ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభమైన మీడియాపై దారుణాలకు దిగుతుంటే ఇక సామాన్యులకు రక్షణ ఎక్కడిది. జర్నలిస్టులందరికీ సీఎం జగన్మోహన్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు

### వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలి



సీఎం జగన్ నిర్వహించిన రాప్తాడు సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను విచక్షణా రహితంగా కొట్టిన వారి పై పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేయాలి. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా కఠిన చట్టాలను అమలు చేయాలి.

- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే

### రౌడీలకు రాజ్యంగా రాష్ట్రం



రాష్ట్ర ముఖ్యమంత్రి సభలో మీడియా మిత్రుడిపై జరిగిన దాడిని జనసేన పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నాం. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి శాంతిభద్రతలు పూర్తిగా లోపించాయి. రౌడీలకు రాజ్యంగా రాష్ట్రం మారిపోయింది.

- చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి, జనసేన జిల్లా అధ్యక్షుడు

### వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే!



వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఆంధ్రజ్యోతి ప్రశ్నిస్తున్నందుకు ఓర్వలేకనే ఈ దాడి జరిగింది. సిద్ధం సభ అంటే దాడులు, దౌర్జన్యాలకు వెనుకాడబోమని ప్రతిపక్ష పార్టీలకు హెచ్చరిక చేస్తున్నట్లుగా శ్రీకృష్ణపై దాడి సంఘటన తెలియజేస్తోంది. పోలీసుల సమక్షంలో విలేకరిపై దాడి చేయడమే కాకుండా పోలీసులపైనే వైసీపీ మూకలు దాడికి యత్నించాయి. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలి.

- అజయ్‌కుమార్, జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి

### ఇది రాక్షస చర్య



రాక్షసతత్వాన్ని, రౌడీయిజాన్ని సీఎం జగన్ ప్రోత్సహిస్తున్నారు అనడానికి ఇదే నిదర్శనం. సీఎం పాల్గొన్న సభలోనే ఇలా జరిగితే ఇక మామూలు సభల్లో పరిస్థితి ఏమిటన్నది ఆందోళనకరమే. డీజీపీ వ్యాఖ్యలు సరికాదు. తన పదవిని కాపాడుకునేందుకు మాట్లాడుతున్నాడే తప్ప బాధ్యతకలిగిన అధికారిగా కాదు. జర్నలిస్టులపై దాడికి సుప్రీం కోర్టు తీసుకువచ్చిన చట్టాలను అమలు చేయాలి.

- దామా అంకయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి

### దాడి దుర్మార్గం



విధులు నిర్వహించే జర్నలిస్టులపై రాజకీయ పార్టీలు దాడులు చేయడం దుర్మార్గం. వాళ్లతో ఇబ్బందులు ఉంటే న్యాయపరంగా చేసుకోవాలే తప్ప ఇలా ప్రత్యక్ష దాడులకు పాల్పడటం సరైనది కాదు. ఇలాంటి ఘటనలు భవిష్యత్ తరాలకు ప్రమాదకర సూచనలు అందిస్తాయి.

- మూలం రమేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి

### దాడి అమానుషం



ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడం అమానుషం. ఈ దాడి వెనుక వైసీపీ నేతల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దాడిని తీవ్రంగా పరిగణించి దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. ఇలా దాడులు చేస్తూ పోతే ప్రభుత్వం మీద కూడా ప్రజలకు మంచి భావన ఉండదు

- చేవూరు దేవకుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు



బోగోలులో నల్లరిబ్బన్లు ధరించి



బుచ్చిలో విపక్షాల రాస్తారోకో



కావలిలో నినదించిన జర్నలిస్టులు



విడవలూరులో టీడీపీ ర్యాలీ

### ఫొటోలు అప్‌లోడ్ చేయలేదని
## 163 మంది హెచ్‌ఎంలకు నోటీసులు

నెల్లూరు (విద్య) : విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్నారన్న కారణాలతో జిల్లాలోని 163 మంది హెచ్‌ఎంలకు డీఈవో రామారావు సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పాఠశాలల్లో పరిశుభ్రతకు సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేయని 19 మంది హెచ్‌ఎంలకు, మధ్యాహ్న భోజనంకు సంబంధించిన ఫొటోలను కొంతకాలంగా అప్‌లోడ్ చేయని 69 మంది హెచ్‌ఎంలకు, మధ్యాహ్న భోజన పథకానికి విద్యార్థుల హాజరు శాతం తక్కువగా నమోదవుతున్నా పట్టించుకోని 75 మంది హెచ్‌ఎంలకు నోటీసులు జారీ చేశారు. వెంటనే లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో శాఖా పరమైన చర్యలు తప్పవని డీఈఓ హెచ్చరించారు. జిల్లాలో హెచ్‌ఎంలకు నోటీసులు జారీ చేయడం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## పరీక్షలున్నాయ్.. విద్యుత్‌కు అంతరాయం కలిగించొద్దు!

- ఎస్‌ఈ విజయన్



నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 19 : త్వరలో ఇంటర్మీడియెట్, పదవ తరగతి పరీక్షలు జరగనున్న దృష్ట్యా నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ విజయన్ అధికర సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలోని ఎగ్జిక్యూటివ్, డిప్యూటీ, అసిస్టెంట్ ఇంజనీర్లతో సోమవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. 33, 11 కేవీ లైన్లలో పెట్రోలింగ్‌ని పూర్తి చేయాలని, అవసరమైన ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇక జీఐఎస్ సర్వే పనులు పూర్తి చేయాలని పదేపదే చెబుతున్నా కొన్ని సెక్షన్లలో పనులు పూర్తి కావడంలేదని పేర్కొన్నారు. వరికుంటపాడు, కొండాపురం, జలదంకి, కలిగిరి, రాపూరు, ఓజిలి, కావలి రూరల్ సెక్షన్లలో సర్వే పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఈఈ శేషాద్రి బాలచంద్ర, సీనియర్ అకౌంటెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఏడాదిలో ఎంత తేడానో!

- గతేడాదితో పోలిస్తే జిల్లాలో తగ్గిన ఓటర్లు
- కొన్నిచోట్ల పెరుగుదల, మరికొన్ని చోట్ల తగ్గుదల
- కావలిలో అత్యధికంగా 10,327 ఓట్ల తేడా



నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా ఏటా జనాభా పెరుగుతూ ఉంటుంది. గడిచిన దశాబ్ద కాలంగా జనాభా గణాంకాలు కూడా ఇవే చెబుతున్నాయి. అందుకు తగ్గట్లుగా నే ఓటర్ల సంఖ్య కూడా పెరగాలి. కానీ జిల్లాలో విచిత్రంగా గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పెరగకపోగా భారీగా తగ్గింది. 2023లో ప్రచురించిన ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో ఓటర్ల సంఖ్య 19,14,519 ఉండగా, అది 2024కు వచ్చే సరికి ఆ సంఖ్య 19,08,498గా నమోదైంది. అంటే 6,021 ఓట్లు తగ్గాయి. ఎందుకిలా.. దీనికి కారణమేమిటన్నది ఆసక్తిగా మారింది. కావలి, ఆత్మకూరు, కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో ఓట్లు తగ్గగా, కందుకూరు, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, ఉదయగిరి నియోజకవర్గాల్లో మాత్రం ఓటర్ల సంఖ్య పెరిగింది. అత్యధికంగా కావలిలో గతేడాదికి, ఇప్పటికి 10,327 ఓట్లు తగ్గడం అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. గతంలో ఇన్ని డబుల్ ఎంట్రీలు, చనిపోయిన వారి ఓట్లు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లు తగ్గిన నియోజకవర్గాల్లో ఉన్నాయా? లేదా ఈ ఏడాదిలో ఇంత మంది చనిపోవడమో లేక వలస వెళ్లడమో చేశారా.. అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నెల్లూరు సిటీ, రూరల్ వంటి అర్బన్ నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య పెరిగిందంటే ఆశ్చర్యం లేదు కానీ గ్రామీణ ప్రాంతాల నియోజకవర్గాల్లో భారీగా తగ్గడం ఆశ్చర్యంగా ఉంది. కాగా 2023, అక్టోబరులో ప్రచురించిన ముసాయిదా జాబితాకు, 2024 జనవరిలో ప్రచురించి తుది ఓటర్ల జాబితా మధ్య కూడా ఆశ్చర్యకర సంబంధాలు కనిపిస్తున్నాయి. ముసాయిదా ప్రచురణ సమయంలో జిల్లాలో 19,11,432 మంది ఓటర్లు ఉండగా అదే తుది జాబితాలో 19,08,498 మంది ఓటర్లు ఉన్నారు. అంటే 2934 ఓట్లు తగ్గాయి. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ముసాయిదాకు, తుది జాబితాకు మధ్య ఓటర్ల పెరుగుదల కనిపించగా ఒక్క నెల్లూరు జిల్లాలో మాత్రమే ఓట్లు తగ్గడం గమనార్హం.

| నియోజకవర్గం | 2023 | 2024 | తగ్గుదల/పెరుగుదల |
|---|---|---|---|
| కందుకూరు | 2,21,568 | 2,26,765 | 5,197 |
| కావలి | 2,44,557 | 2,34,230 | - 10,327 |
| ఆత్మకూరు | 2,16,498 | 2,12,939 | - 3,559 |
| కోవూరు | 2,65834 | 2,61,182 | - 4,652 |
| నెల్లూరు సిటీ | 2,33,237 | 2,37,736 | 4,499 |
| నెల్లూరు రూరల్ | 2,62,399 | 2,67,750 | 5,351 |
| సర్వేపల్లి | 2,31,863 | 2,29,139 | - 2,724 |
| ఉదయగిరి | 2,38,563 | 2,38,757 | 194 |
| మొత్తం | 19,14,519 | 19,08,498 | - 6,021 |

### సంబరం



ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా సోమవారం సాయంత్రం నెల్లూరు నగరంలో భారీ ర్యాలీ జరిగింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వీఆర్సీ మైదానం నుంచి గాంధీబొమ్మ వరకు ఈ ర్యాలీ సాగింది. దేశం గర్వించదగ్గ వ్యక్తి ఛత్రపతి శివాజీ అని, ఆయన ఆశయాల సాధనకు యువత నడుం బిగించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.



పొదలకూరు : చాటగొట్లలో నమూనాలు సేకరిస్తున్న బృంద సభ్యులు

## 'బర్డ్ ఫ్లూ' విస్తృతిపై ఆరా

- జిల్లాలో కేంద్ర, రాష్ట్ర బృందాల పర్యటన
- వైద్యసేవలపై జీజీహెచ్‌లో పరిశీలన
- కలెక్టర్, డీఎంహెచ్‌వోను కలిసిన బృందాలు

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 19 : జిల్లాలో బర్డ్ ఫ్లూ విజృంభిస్తుండటంతో కేంద్ర, రాష్ట్ర వైద్య బృందాలు సోమవారం జిల్లాలో పర్యటించాయి. ఒకవేళ బర్డ్ ఫ్లూ వ్యాధి మనుషులకు సోకితే తగిన వైద్యసేవలపై దృష్టి పెట్టాయి. ప్రత్యేకించి నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తగిన ఏర్పాట్లను పరిశీలించింది. ఇక్కడ ఎన్ని పడకలు ఉన్నాయి. ఐసీయూలో సదుపాయాలు, మందులు, అందుబాటులో ఉన్న ఆక్సిజన్ వంటి వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించారు. ఢిల్లీకి చెందిన ఎన్‌సీడీసీ అధికారి డాక్టర్ స్మితాసింగాల్, పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్ గుర్మితాకౌర్, సత్తార్‌జంగ్ ఆసుపత్రి పల్మనాజిస్ట్ శ్రీయాస్ శర్మ, రాష్ట్రానికి చెందిన సర్వైలెన్స్ జేడీ మల్లీశ్వరి, జిల్లా సర్వైలెన్స్ అధికారి భాస్కర్ తదితరులు జీజీహెచ్ సూపరింటెండెంట్ సిద్దానాయక్‌తో సమావేశమై పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ హరినారాయణన్, డీఎంహెచ్‌వో పెంచలయ్యను కలిసి జిల్లాలో పరిస్థితిపై చర్చించారు. కాగా, కోవూరు మండలం గుమ్మళ్లదిబ్బ, పొదలకూరు మండలం చాటగోట్లలలో బర్డ్ ఫ్లూ వల్ల దెబ్బతిన్న కోళ్లఫారాలను చూశారు. అక్కడ పనిచేస్తున్న వారి నమూనాలు సేకరించి, తిరుపతిలోని స్విమ్స్ ల్యాబ్‌కు తరలించారు.

### 'సోమశిల'లో 20.011 టీఎంసీల నిల్వ

అనంతసాగరం : సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారం నాటికి జలాశయంలో 20.011 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తరకాలువకు 600, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

## మర్రిగుంటలో బ్యారన్ దగ్ధం


బ్యారన్‌లో కాలిపోతున్న పొగాకు

కొండాపురం, ఫిబ్రవరి19: మండలంలోని మర్రిగుంటలో సోమవారం వేకువజామున పొగాకు బ్యారన్ దగ్ధమైంది. గ్రామానికి చెందిన చిట్టాబత్తిన గణపతిరావు పొగాకు క్యూరింగ్ పూర్తయి దించేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని పొగాకు కాలిపోయింది. ఈ ప్రమాదంలో చిట్టాబత్తిన మాధవ, గణపతి, మాల్యాద్రిలకు చెందిన పొగాకు కాలిపోయి సుమారు రూ.7 లక్షల ఆస్తి నష్టం జరిగింది. అగ్నిమాపక యంత్రం వచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా అప్పటికే లోపల ఉన్న పొగాకు పూర్తిగా కాలిపోయింది. ప్రభుత్వం, టుబాకో బోర్డు అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## వృద్ధుడిని హత్య చేసింది పింటూనే ! : రూరల్ డీఎస్పీ


హత్యకేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ, పక్కన సీఐ, ఎస్సైలు

బుచ్చిరెడ్డిపాళెం.ఫిబ్రవరి 19: మండలంలోని సాల్మాన్‌పురంలో ఈనెల 15వతేదీ రాత్రి పల్లి నారాయణరెడ్డి(88)ని దారుణంగా హత్య చేసింది రాజస్థాన్ రాష్ట్రంలోని జాలూర్ జిల్లా భాక్రాగావ్‌కు చెందిన భాటి పింటూయేనని రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి తెలిపారు. సోమవారం బుచ్చి పోలీస్‌స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హత్యకేసు వివరాలను వెల్లడించారు. సాక్ష్యాలులేని ఈ కేసును మృతుడి కుమారుడు పల్లి శేషారెడ్డి ఫిర్యాదు మేరకు బుచ్చి సీఐ హైమారావు, ఎస్ఐ మహేంద్ర, అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి ఛేదించారని వివరించారు. బుచ్చిలో కూల్‌డ్రింక్ షాపు నిర్వహించే పింటూకి నారాయణరెడ్డి అప్పుగా ఇచ్చిన రూ. 40వేలకు వడ్డీ విషయంతోపాటు, కూల్‌డ్రింక్ తాగి డబ్బులివ్వకపోవడంపై పింటూతో గొడవపడ్డాడు. దీంతో ఇంట్లో వృద్ధుడు ఒక్కడే ఉంటాడు కదా, హత్య చేసినా ఎవరూ కనుక్కోలేరనే ఆలోచనతో పథకం ప్రకారం 15రాత్రి 9గంటలకు దుకాణం మూసేసి పింటూ ఆటోలో సాల్మానుపురానికి వెళ్లాడు. ఆటో దిగి వృద్ధుడి ఇంటికి సమీపంలోకి వెళ్తుండగా అక్కడ ఓ మహిళ వీధిలోకి వస్తుండంతో వెనక్కివెళ్లి ఓ ప్లాట్‌లో దాక్కున్నాడు. ఆమె వెళ్లిన తరువాత పింటూ వృద్ధుడి ఇంటికి వెళ్లి ముఖంపై గుడ్డ వేశాడు. దీంతో వృద్ధుడికి మెలకువ వచ్చి లేచి చింటూ ఏంది ఇప్పుడొచ్చావు... నన్నేమైనా చేయాలని వచ్చావా ? అని అడిగాడు. ఊర్లో వేరే డబ్బులు విషయం మాట్లాడిపోదామని వచ్చానంటూ చెబుతూ ఒక్కసారిగా నారాయణరెడ్డిని గొంతుపట్టుకుని తోసేసి తనతో తెచ్చుకున్న కత్తితో పొడిచి దారుణంగా చంపినట్టు విచారణలో తేలిందని డీఎస్పీ తెలిపారు. మళ్లీ బతుకుతాడనే అనుమానంతో ఇంట్లో పడివున్న బాల్‌పెన్‌తో పొడిచాడు. మొదట గొంతు నొక్కే క్రమంలో ముద్దాయి వేలు నోట్లో పడడంతో నారాయణరెడ్డి ఆ వేళ్లు కొరికిన గాయాలయ్యాయి. ఈమేరకు విచారణలో నేరాన్ని నిందితుడు అంగీకరించగా సీఐ అరెస్టు చేసినట్టు రిమాండ్‌కు తరలించినట్టు ఆయన తెలిపారు. కేసును ఛేదించిన బుచ్చి సీఐ హైమారావు, ఎస్ఐ మహేంద్ర, వారి బృందాన్ని అభినందించి వారితోపాటు కానిస్టేబుళ్లు ఆదినారాయణ, సంపత్, నవీన్, సురేష్, కామేశ్వరరావులను ఎస్పీ అభినందించి వారికి రివార్డులు ప్రకటించారని డీఎస్పీ తెలిపారు.

## ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 2,862 మంది హాజరు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 19 : ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జరుగుతున్న ప్రయోగ పరీక్షల (ప్రాక్టికల్)కు సోమవారం జిల్లా వ్యాప్తంగా 2,862 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 1506 మందికి 1480 మంది హాజరుకాగా 26 మంది గైర్హాజరయ్యారు. మధ్నాహ్నం 1405 మందికి 1382 మంది హాజరుకాగా 23 మంది గైర్హాజరయ్యారు.

## వృద్ధురాలి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 19: కీళ్ల నొప్పులు భరించలేక ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని డైకాస్‌రోడ్డు ప్రాంతం ఎస్‌సీసీ కాలనీ మూడో వీధిలో విశ్రాంత పంచాయతీ కార్యదర్శి వీ సుందర్ రాజు, అమరావతి(58) దంపతులు నివసిస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. అమరావతి షుగర్, బీపీ, కీళ్లనొప్పులతో బాధపడుతోంది. పలు వైద్యశాలల్లో చూపించుకున్నా ఆరోగ్యం కుదుట పడకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకుంది. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి ఆమెను కిమ్స్ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుడు అనిల్ ఫిర్యాదుతో వేదాయపాళెం పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పోలీసు స్పందనకు 80 ఫిర్యాదులు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 19: నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం పోలీసు స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లా వ్యాప్తంగా 80 మంది ఫిర్యాదుదారులు తరలి వచ్చి వారి సమస్యలు తెలుపుకున్నారు. ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వరరెడ్డి ఫిర్యాదులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ హత్యకు సంబంధించిన కేసులలో అలసత్వం లేకుండా అన్ని కోణాలలో దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనుమానాస్పద, మిస్సింగ్ కేసులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సాంకేతికత ఆధారంగా త్వరితగతిన ఛేదించాలని సూచించారు. స్పందన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు.

## జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ నియామకం

నెల్లూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని నియమిస్తూ కలెక్టర్ ఎం హరినారాయణన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ చైర్మన్‌గా కలెక్టర్, సభ్యులుగా మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎస్పీ ఉంటారు. అలానే అఫిషియల్ సభ్యులుగా జడ్పీ డిప్యూటీ సీఈవో చిరంజీవి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, డీఎంహెచ్‌వో ఎం పెంచలయ్యలను నియమించారు. ఇక నాన్ అఫిషియల్ సభ్యులుగా బత్తా ప్రవల్లిక, దుంపా యషోబు, అలగర ప్రభాకర్, మెట్టల చెంచు కృష్ణయ్య, గండళ్ల శ్రీరాములను నామినేట్ చేశారు. అట్రాసిటీ కమిటీలో సభ్యులుగా షేక్ బషీర్, ఇస్కాల సాయిప్రసాద్, ఉల్లిపాయల మురళీకృష్ణయాదవ్‌లను నియమించారు.

## మద్యం విక్రయాలపై దాడులు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 19: అనధికారికంగా మద్యం విక్రయాలు సాగిస్తున్న వ్యక్తిని నెల్లూరులోని చిన్నబజారు పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు... రాపూరుకు చెందిన రమేష్‌రెడ్డి కొంతకాలంగా నెల్లూరులో నివాసం ఉంటూ మద్రాసు బస్టాండు వద్ద ఉన్న ఓ బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున ఎస్ఐ సైదులు సోమవారం అతనిని అరెస్ట్ చేశారు. రమేష్‌రెడ్డి వద్ద నుంచి 8 క్వార్టర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

## వృద్ధుడిపై యువకుల హత్యాయత్నం

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 19: పోలీసులకు ఫిర్యాదు చేశాడన్న అనుమానంతో ఓ వృద్ధుడిపై కొందరు యువకులు హత్యాయత్నం చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని సంతపేటలో గోవర్ధన్ అనే వృద్ధుడి కుటుంబం నివసిస్తోంది. ఆయన ఇంటికి సమీపంలో దస్తగిరి, మస్తాన్, ఉమర్, అజిత్, కుల్లా, నవీద్ అనే యువకులు నిత్యం మద్యం సేవించి అల్లరి చేస్తుండేవారు. ఇటీవల పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని మందలించారు. తమపై గోవర్ధనే పోలీసులకు ఫిర్యాదు చేశాడన్న అనుమానంతో వారు కక్షపెంచుకున్నారు. ఈ నెల 18వ తేదీ రాత్రి గోవర్ధన్ ఇంటి ముందు నిలబడి ఉండగా నిందితులు రాళ్లు, రాడ్‌తో దాడి చేశారు. గాయపడ్డ ఆయన ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

## సీబీఎస్ఈ టెన్త్, ఇంటర్ పరీక్షల ప్రారంభం

నెల్లూరు (విద్య) : సీబీఎస్ఈ టెన్త్, ఇంటర్ విద్యార్థులకు సోమవారం నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా టెన్త్ పరీక్షలకు 1,246 మంది, ఇంటర్మీడియట్‌కు 461 మంది కలిపి మొత్తం 2,707 మంది విద్యార్థులు హాజరయ్యారు. కఠిన నిబంధనల మధ్య ఈ పరీక్షలను జిల్లాలోని పది కేంద్రాల్లో నిర్వహించేందుకు కేంద్రీయ విద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఏర్పాట్లు చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 19 సీబీఎస్ఈ పాఠశాలలు ఉండగా వీటిలో ఈ ఏడాది పది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 2వతేదీ వరకు జరిగే ఈ పరీక్షలకు ప్రశ్నపత్రాలు కూడా జంబ్లింగ్ విధానంలో ఉంటాయని, ఢిల్లీకి చెందిన కేంద్రీయ విద్యాలయం అధికారులు చెన్నై అధికారులను సమన్వయం చేసుకుంటూ ఆన్‌లైన్‌లో పరీక్షలను పర్యవేక్షిస్తారని నిర్వాహకులు తెలిపారు. ప్రతి గదికి సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

### చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో |
|---|---|
| బాయిలర్ లైవ్ | 146 |
| లేయర్ లైవ్ | 80 |
| స్కిన్ చికెన్ | 256 |
| స్కిన్‌లెస్ | 284 |
| లేయర్ | 136 |

### బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ. 5915 |
| వెండి కిలో ధర | రూ. 73,400 |
| వెండి ఒక గ్రాము | రూ. 75.40 |

## నేడు డయల్ యువర్ ఆర్ఎం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ఆర్టీసీ బస్సు సర్వీసుల గురించి ప్రయాణికుల సలహాలు స్వీకరించేందుకు మంగళవారం డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి పీవీ శేషయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 0861-2325196 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

## జగనన్న కాలనీలో జోరుగా పేకాట

కావలి రూరల్ : పట్టణంలోని ముసునూరు జగనన్న కాలనీ పేకాట స్థావరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఈడీ కళాశాలకు ఆనుకుని వెనుక వైపున విచ్చలవిడిగా పేకాట జరుగుతుందని వారు తెలిపారు. నివాసాలను అడ్డాగా చేసుకుని పేకాట ఆడుతున్నారని వారు పేర్కొన్నారు.

# భరోసా ఏది ?

- దిగజారిన ఉప్పు ధరలు
- నాడు రూ.450, నేడు రూ.175
- ఆపై విద్యుత్ బిల్లుల భారం
- ఆందోళనలో రైతులు

అల్లూరు, ఫిబ్రవరి 19 : మద్దతు ధర లభించడంతో రెండేళ్లుగా ఉప్పు రైతులు ఆనందపడ్డారు. కానీ ఆ ఆనందం ఎంతోకాలం నిలువలేదు. ఈ ఏడాది ఉప్పు ఉత్పత్తి అయ్యేనాటికి ధరలు దిగజారడంతో వారు ఆందోళన చెందుతున్నారు. రెండేళ్లుగా క్వింటం ఉప్పు ధర రూ.450 వరకు పలికింది. ఈ ఏడాది ఆ ధర రూ.175లకు పడిపోయింది. గతంలో పెరిగిన ఉప్పు ధరలతోపాటు కూలీలు పెరిగాయి. కానీ ప్రస్తుతం ధరలు దిగజారినా కూలీల రేట్లు తగ్గకపోవడంతో తమకు నష్టాలు తప్పవని రైతులు అంటున్నారు.

**● విద్యుత్ బిల్లుల భారం**

ఉప్పు కయ్యల్లో నీటిని నింపాలంటే విద్యుత్ మోటార్లు అవసరం. విద్యుత్ వినియోగం కారణంగా వచ్చే బిల్లులు ఇటీవల పెనుభారమయ్యాయి. రెండేళ్లుగా మద్దతు ధర లభించడంతో విద్యుత్ బిల్లులను ఉప్పు రైతులు భరించారు. నేడు దిగజారిన ధరలతో అవి వారికి భారమయ్యాయి. గత డిసెంబరులో వచ్చిన తుఫాన్‌కు లోతట్టు ప్రాంత ఉప్పు కయ్యల్లోకి నీరు చేరి కట్టలు, బోర్లు ధ్వంసమయ్యాయి. వాటికి మరమ్మతులు చేపట్టిన రైతులు తిరిగి ఉప్పు ఉత్పత్తికి పూనుకున్నారు. ఇంతలో ధరలు తగ్గడం వారిని ఆందోళనకు గురిచేసింది.

**● ధరల స్థిరీకరణ ఎక్కడ ?**

రైతుల ఉత్పత్తులకు, సాగుచేసే పంటలకు గిట్టుబాటు ధరలు లేకుండా పోయాయి. మార్కెట్లో ఏ ధర పలికితే ఆ ధరలకే రైతులు తమ ఉత్పత్తులను, పంటలను అమ్ముకోవాలి.ధరల స్థిరీకరణ లేక రైతుల బతుకులకు భరోసా కరువైంది.

**● భారంగా కుటుంబాల పోషణ**

ఫిబ్రవరి నుంచి ఏడు నెలలపాటు రైతులు ఉప్పు ఉత్పత్తిని కొనసాగిస్తారు. ఈ కాలంలో ఉప్పును విక్రయించి వచ్చిన నగదును కుటుంబ పోషణకు వాడుకుంటారు. ఇటీవల ధరలు పతనమవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది.


విక్రయానికి సిద్ధంగా ఉన్న ఉప్పు కుప్పలు

**అప్పులు తీరుతాయని..**

గతంలో మెరుగైన ధరలు రావడంతో ఉప్పురైతుల ఆశలు చిగురించాయి. పెరిగిన ధరలతో అప్పుల బాధలు తీరుతాయని భావించాం. ధరలు తగ్గడంతో మళ్లీ సాధారణ జీవనానికి వచ్చాం.

- పురిణి ఏడుకొండలు, ఉప్పు రైతు, తూర్పు గోగులపల్లి

**భరోసా కల్పించేవారేరీ ?**

ఉప్పు రైతులకు భరోసా కల్పించే నాథుడే లేకుండా పోయారు. ధరలు ఆశాజనకంగా ఉన్నాయని భావించేలోపే పతనమయ్యాయి. ధరలు తగ్గడంతో కుటుంబ పోషణ కష్టతరంగా మారింది.

- గోళ్ల ఆదాం

# స్పందన అర్జీలకు ప్రాధాన్యమివ్వాలి : కలెక్టర్


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 19 : జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమానికి వచ్చే అర్జీలకు ప్రాధాన్యమిచ్చి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారు లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. వచ్చిన అర్జీలే మళ్లీ మళ్లీ రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో లవన్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.

● కలువాయి మండలం వేదనపర్తిలోని కోదండరామస్వామి ఆలయంలో ఉభయం చేసుకునే అవకాశం ఇవ్వాలని కోరుతూ ఆ గ్రామ వాసి తురక అంకయ్య, మన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లాల శ్రీనివాసులు, మహిళా అధ్యక్షురాలు పల్లాల సునీత కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. 40 ఏళ్ల చరిత్ర ఉన్న ఆ దేవాలయంలో వడ్డెర కులానికి చెందిన 30 కుటుంబాల వారు పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఏడాదిలో నాలుగు ఉభయా లు జరుగుతుంటాయని తెలిపారు. గతంలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు మూడు ఉభయాలు, వడ్డెర కులానికి చెందిన తాము ఒక ఉభయం జరుపుకునే వాళ్లమని తెలిపారు. అయితే ఆలయ జీర్ణోద్ధరణ తర్వాత తమకు ఉభయం చేసుకునే అవకాశం కల్పించలేదని, తమకు న్యాయం చేయాలని కోరారు.

● అల్లీపురంలో టిడ్కో ఇళ్లలో కనీస వసతులు కల్పించాలని కోరుతూ జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. గత ప్రభుత్వం నిర్మించిన టిడ్కో గృహాలను వైసీపీ నాయకులు ఎన్నికల స్టంట్‌గా, తామిచ్చామని ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు.

● వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు పగటిపూట 3 ఫేస్‌లో 9 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, నాయకుడు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. వైసీపీ ఎన్నికల హామీలో 9 గంటల కరెంటు ఇస్తామని ప్రకటించి, ఇప్పుడు 7 గంటలు కూడా ఇవ్వటం లేదని ఆరోపించారు. ఈ కార్యక్ర మంలో నాయకులు పముజుల ప్రదీప్, మలినేని వేణు నాయుడు పాల్గొన్నారు.

# ఇంత ఘోరమైన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు : సోమిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సోమిరెడ్డి, చిత్రంలో మాలేపాటి సుబ్బానాయుడు, కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, ఫిబ్రవరి19: తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇంత ఘోరమైన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. కావలి టీడీపీ ఇన్‌చార్జిగా కావ్య క్రిష్ణారెడ్డిని నియమించిన అనంతరం మాజీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడుని పరిచయం చేస్తూ సోమవారం సాయంత్రం బృందావనం హౌసింగ్ కాలనీ కల్యాణ మండపంలో సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సోమిరెడ్డి మాట్లాడుతూ ఈ దుర్మార్గపుపాలనలో ఘోరాలు, నేరాలలో సర్వేపల్లి మొదటి స్థానంలో ఉండగా, కావలి రెండో స్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావటం నూరుశాతం ఖాయమైనప్పటికీ మితిమీరిన ఆత్మవిశ్వాసం వద్దన్నారు. కావలి నేతలు సమన్వయంతో పనిచేసి క్రిష్ణారెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

**● అరాచకాలు మరచిపోలేదు..**

రాష్ట్రంతోపాటు కావలిలో వైసీపీ చేసిన అరాచకాలు మరచిపోలేదని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర తెలిపారు. ఎవరెన్ని చెప్పినా ముసునూరులో ఎన్టీఆర్ విగ్రహం తొలగింపు, ఫైర్‌స్టేషన్ రోడ్డులో అమృత్ పథకం శిలాఫలకం ధ్వంసం, అందుకు బాధ్యులైన అధికారులు, నేతలు అందరినీ గుర్తు పెట్టుకుని ఉన్నామని, తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కాగా సాక్షిలో తనపై వచ్చిన కథనాలు పూర్తి అవాస్తవాలని ఆయన పేర్కొన్నారు.

**● కార్యకర్తలను కాపాడా...**

కావలి టీడీపీ ఇన్‌చార్జి పదవికి ఎవరూ ముందుకు రాని రోజుల్లో తాను నిలబడి కార్యకర్తలను కాపాడానని మాజీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. అప్పట్లో ప్రజల కోసం కార్యాలయాలకు వెళితే కూర్చోమని కూడా చెప్పకుండా అధికారులు పరాభవం చేశారని, కనుక టీడీపీ అధికారంలోకి రాగానే అలాంటి అధికారులపై కక్ష తీర్చుకునేందుకు తనకు అధికారం ఇవ్వాలన్నారు. కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేనైనా నీ అడుగు జాడల్లో నడుస్తూ నిన్ను గురువుగా, అన్నగా భావించి ముందుకు పోతానని మాలేపాటికి భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు, కందుకూరు ఇన్‌చార్జి ఇంటూరు నాగేశ్వరరావు, కావలి పార్టీ పరిశీలకులు బొమ్మి సురేంద్ర, ఏబీఎన్ సంస్థల అధిపతి జీడీడీ దివాకర్, స్థానిక నేతలు గుత్తికొండ క్రిషోర్, జ్యోతిబాబూరావు, పోతుగంటి అలేఖ్య, గుంటుపల్లి శ్రీదేవి చౌదరి మాట్లాడారు.

# యువకుడి దారుణ హత్య

- ఇంట్లోనే భార్య కళ్ల ఎదుటే ఘాతుకం
- ఒంటిపై 25కుపైగా కత్తిపోట్లు
- పాతకక్షలే కారణం?


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్లు, (అంతర్‌చిత్రంలో) పెంచల ప్రసాద్ (ఫైల్)

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 19: ఓ యువకుడిని అతని ఇంట్లోనే భార్య చూస్తుండగానే గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. ఆదివారం రాత్రి నెల్లూరులోని నవాబుపేట రామచంద్రాపురం రామమందిరం వీధిలో ఈ దారుణం జరిగింది. పాతకక్షల నేపథ్యంలో స్థానికులే ఈ ఘోరానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసులు అనుమానితులైన ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

రామచంద్రాపురం రామాలయం వీధిలో ఎం నరసింహులు, కాంతమ్మ దంపతులు నివసిస్తున్నారు. వారికి ప్రసన్న, లక్ష్మీ, ప్రభావతి, పెంచలప్రసాద్(35) సంతానం. పెంచల ప్రసాద్‌కు తన పెద్ద అక్క కుమార్తె సుహితతో ఆరేళ్లక్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు. పెంచల ప్రసాద్ ట్రక్కు ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 18వ తేదీ ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా 11 గంటల తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు గోడదూకి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంటి తలుపులు తట్టగా పెంచల ప్రసాద్ తలుపులు తీయడంతో ఐదుగురు వ్యక్తులు కత్తులతో దాడి చేశారు. భర్త అరుపులతో నిద్ర లేచిన సుహిత కేకలు వేయడంతో దుండగుల్లో ఓ వ్యక్తి ఆమెను దిండుతో నొక్కిపెట్టాడు. పెంచల ప్రసాద్‌ను విచక్షణా రహితంగా కత్తులతో పొడిచారు. దీంతో పెంచలప్రసాద్ బెడ్డు మీద కుప్పకూలిపోయాడు. అయినా కనికరించని నిందితులు మెడ నరాలు, మణికట్టు, కాళ్ల మడిమలను కిరాతకంగా నరికారు. పెంచల ప్రసాద్ చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత అక్కడి నుంచి పరారయ్యారు. సరిగ్గా అదే సమయంలో ప్రసాద్ రెండో అక్క లక్ష్మీ కుటుంబం ఊరి నుంచి వచ్చింది. స్థానికులైన వర, సాగర్, సాయి, మనో అనే వ్యక్తులు మృతుని ఇంటిగేటు నుంచి పరుగెత్తుకుంటూ వెళ్లడాన్ని వారు గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా పెంచలప్రసాద్ దారుణ హత్యకు గురై ఉన్నాడు. దీంతో విషయాన్ని పోలీసులకు తెలియజేశారు.

**● పాతకక్షల నేపథ్యంలోనేనా...**

పాతకక్షల నేపథ్యంలో ఈ హత్య జరిగినట్లు బాధిత కుటుంబం పోలీసులకు తెలిపింది. 2022 సంవత్సరంలో రామచంద్రాపురంలో వినాయక చవితి వేడుకలు జరిగిన సమయంలో పెంచలప్రసాద్ సన్మానం చేయలేదని స్థానికంగా ఉండే వర, సాగర్, సాయి, మనోలు గొడవకు దిగారని చెప్పారు. అప్పటి నుంచి వారు కక్ష పెంచుకున్నట్లు చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఈ ఏడాది జనవరి నెలలో ఇంటి ముందు వేసి ఉన్న ముగ్గులను బైక్‌లతో కావాలనే చెరిపేస్తున్నారని నవాబుపేట పోలీసు స్టేషన్‌లో పెంచల ప్రసాద్ కొందరిపై ఫిర్యాదు చేశారని, అది మనుసులో పెట్టుకొని కూడా హత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కాగా, నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి, నవాబుపేట ఇన్‌స్పెక్టర్ ఎం బాబీ, రాత్రి విధుల్లో ఉన్న చిన్నబజారు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. హత్య జరిగిన తీరును పెంచల ప్రసాద్ భార్యను అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీమ్ వేలిముద్రలను సేకరించింది. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా రెండు ఆటోలు, ఒక బైక్ రామాలయం వీధిలోకి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఆ కోణంలో విచారణ చేపట్టిన పోలీసులు ఐదుగురి ఇళ్లకు వెళ్లి చూడగా వారు కనిపించక పోవడంతో వారే హత్య చేసి ఉంటారని భావిస్తున్నట్లు తెలిసింది.

## జైలులో ఖైదీలకు వసతులపై ఆరా



ఖైదీలతో మాట్లాడుతున్న విజయభారతి సాయిని

వెంకటాచలం, ఫిబ్రవరి 19 : జిల్లా కేంద్ర కారాగారంలో ఖైదీలకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతిసాయిని ఆరాతీశారు. మండలంలోని చెముడుగుంట సమీపంలో ఉన్న జిల్లా కేంద్ర కారాగారాన్ని సోమవారం ఆమె సందర్శించారు. జైలులోని వైద్యశాల, వంటగది, మహిళా ఖైదీల వసతి గది, భోజనశాల, స్టోర్ రూమ్‌ను పరిశీలించి ఖైదీలతో ముఖాముఖిగా మాట్లాడారు. ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జైలులో ఖైదీలకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలపై అడిషనల్ సూపరింటెండెంట్ మహేష్‌బాబు, డీఎస్పీ సాయిప్రవీణ్, జైలర్ రవిబాబు, డిప్యూటీ జైలర్ కన్యాకుమారి ఆమెకు వివరించారు. ఆమె వెంట జాతీయ మానవ హక్కుల కమిషన్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, రీసెర్చ్ కన్సల్టెంట్ వేద సంహిత, తదితరులున్నారు.

### మానవ హక్కుల కమిషన్ సభ్యురాలిని కలిసిన ఎస్పీ

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 19 : జిల్లా పర్యటనకు విచ్చేసిన జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి సాయినను సోమవారం నగరంలోని ఓ హోటల్‌లో ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పలు విషయాలపై వారు చర్చించారు.

### బర్డ్ ఫ్లూ ప్రభావిత ప్రాంతాల్లో
## కేంద్ర బృందం పరిశీలన

● వైరస్ వ్యాప్తిపై ఆరా


పశుసంవర్ధశాఖాధికారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యుడు డాక్టర్ స్మిల్ సంగల్

కోవూరు, ఫిబ్రవరి19: బర్డ్‌ఫ్లూ వైరస్ సోకిన ప్రాంతాల్లో కేంద్ర బృందం సోమవారం పర్యటించింది. మండల పరిధిలోని గుమ్మళ్ళదిబ్బ కాలనీలో కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ స్మిల్ సంగల్, డాక్టర్ గునిమితసోర్, డాక్టర్ శ్రేయస్‌శర్మ ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించారు. వ్యాధి సోకిన కోళ్ల యజమాని కే వెంకటేశ్వర్లుతో మాట్లాడారు. కోళ్లను ఎక్కడి నుంచి తీసుకువచ్చారు.. కోళ్ల మృతి చెందాక ఎంత సమయంలో అధికారులకు తెలియచేశారు.. ప్రయోగశాలకు తీసుకువెళ్లడంలో ఆలస్యం జరిగిందా.. ? అని ఆయన్ను ప్రశ్నించారు. కాలనీలోనే కాకుండా మిగతా గ్రామాలకు వైరస్ వ్యాప్తి చెందిందా ? అని ఆరా తీశారు. అనంతరం బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశుసంవర్ధశాఖాధికారులకు వివరించారు. కేంద్ర బృందం వెంట జిల్లా సర్వేలెన్స్ అధికారి డాక్టర్ భాస్కర్, పశుసంవర్ధశాఖాధికారులు డాక్టర్ నాగమణి, డాక్టర్ మురళి, ఇనమడుగు ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ ఇర్ఫాన్, వైద్యాధికారి డాక్టర్ ప్రీతి తదితరులు ఉన్నారు.

## నూతక్కివారికండ్రికలో వైద్య శిబిరం ఏర్పాటు


జ్వరాల బారిన పడినవారిని పరామర్శిస్తున్న తహసీల్దారు గోపికృష్ణ, వైద్యాధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చేజర్ల, ఫిబ్రవరి 19: ఆంధ్రజ్యోతి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన 'నూతక్కివారి కండ్రికలో విజృంభించిన జ్వరాలు' కథనంపై స్పందించి జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు మండలంలోని నూతక్కివారి కండ్రిక గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ అధికారులు సోమవారం ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని 196 ఇళ్లను పరిశీలించి, జ్వరాలతో బాధపడుతున్న వారి నుండి రక్తన మూనాలను సేకరించి పరీక్షలకు పంపారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సమక్షంలో గ్రామంలోని తాగునీటిని పరిశీలించి పరీక్షలకు పంపారు. తహసీల్దారు గోపికృష్ణ జ్వరాలతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. చిత్తలూరు పీహెచ్‌సీ అధికారులు డా. నవీన్, డా. జ్యోతి రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. పంచాయతీ అధికారులు బ్లీచింగ్ చల్లించడంతో పాటు ఫాగింగ్ చేయించారు. అయితే గ్రామంలో ఉన్న గుంతల్లో మురుగునీరు కారణంగానే దోమలు వ్యాప్తి చెంది జ్వరాల బారిన పడినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారులు నాగార్జున, అంజనేయవర్మ, జయరామ్, ఆర్ఐ సుమతి పాల్గొన్నారు.

## నేడు దివంగత సీఎం నేదురుమల్లి జయంతి

నెల్లూరు (వైద్యం) : దివంగత మాజీ సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి 89వ జయంతిని మంగళవారం నిర్వహిస్తున్నట్లు పీసీసీ సభ్యుడు తలారి బాలసుధాకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందిరాభవన్‌లో జరిగే ఈ వేడుకలో భాగంగా పేదలకు వస్త్రదానం, అన్నదానం జరుగుతాయని తెలిపారు.

# రాప్తాడు ఘటనపై జర్నలిస్టుల ఆందోళన

● వెల్లువెత్తిన నిరసనలు ● వివిధ రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాల మద్దతు ● అధికారులకు వినతులు



కావలి : ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు



కందుకూరు: సబ్‌కలెక్టరు కార్యాలయంలో ఏవోకి వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు

**అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం సభ కవరేజికి వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడిని ఖండిస్తూ సోమవారం జిల్లావ్యాప్తంగా పాత్రికేయులు నిరసన ప్రదర్శనలు, ర్యాలీలు, ఆందోళనలు చేపట్టారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల పోరాటానికి టీడీపీ, జనసేన, వామపక్షాలు, కాంగ్రెస్, బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. వివిధ ప్రజా సంఘాలు మద్దతు పలికాయి. ఆ వివరాలు...**

**కావలి, ఫిబ్రవరి 19**: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకల దాడిని ఖండిస్తూ సోమవారం కావలిలో జర్నలిస్టులు నిరసన తెలిపారు. జర్నలిస్టులందరూ స్థానిక గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అక్కడ నుంచి నినాదాలు చేస్తూ ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి పరిపాలనాధికారికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రింట్, ఎలక్ట్రానిక్, యూట్యూబ్ చానల్ పాత్రికేయులు పాల్గొన్నారు.

**గుడ్లూరు:** ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడిని ఖండిస్తూ మండల జర్నలిస్టు సంఘాలు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనలు తెలిపాయి. తొలుత తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు ఎం. వెంకటేశ్వర్లు, జర్నలిస్టులు మురళి, మల్లికార్జున, నారాయణ, వీర కృష్ణ, సన్నికుమార్, బాలసుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**ఉలవపాడు:** ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై చేసిన హత్యాయత్నాన్ని ఖండిస్తూ మండల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకర్లు సోమవారం తహ సీల్దార్ కే రవిబాబుకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర సమన్వయ సారథి మిరియం శ్రీనివాసులు, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

**చిత్రగుంట:** ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటినాగేశ్వరావు అన్నారు. బోగోలు అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నల్ల రిబ్బన్‌లతో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో తెలుగు తమ్ముళ్లు ఎల్.సుధీర్‌బాబు, నేతి పిచ్చయ్య, చల్లా క్రాంతికుమార్, శ్యామ్, జయకుమార్, సుబ్బారావు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు. రాప్తాడులో శ్రీకృష్ణపై వైసీపీ నేతలు దాడిచేయడం హేయమైన చర్య అని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి లేల్లపల్లి సురేష్‌బాబు, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు అంతరాజ్, జాన్‌సన్‌లు పేర్కొన్నారు.

**కొండాపురం:** ఫొటోగ్రాఫర్‌పై దాడిచేయడం హేయమైన చర్యగా మండల టీడీపీ కన్వీనర్ ఎమ్ ఓంకారం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ నేతలు పీ.రమేష్, గుడవళ్లూరు సర్పంచి బీ.మాచెర్ల తదితరులు మాట్లాడుతూ జర్నలిస్టుపై దాడిని తీవ్రంగా ఖండించారు. దాడిచేసిన వారిని శిక్షించాలంటూ మండల జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో టీడీ కోటేశ్వరరావుకు వినతిపత్రం అందచేశారు.

**కందుకూరు:** రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ గూండాలు పాశవికంగా దాడిచేసి కొట్టడాన్ని నిరసిస్తూ కందుకూరులో సోమవారం జర్నలిస్టులు నిరసన చేపట్టారు. ముందుగా జర్నలిస్టులు ర్యాలీగా వెళ్లి డీఎస్పీ ఎ శ్రీనివాస్, సబ్ కలెక్టరు కార్యాలయం పరిపాలనా అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టు ప్రతినిధులు కె హరిబాబు, పి చంద్రశేఖర్, నాదెళ్ల కోటేశ్వరరావు, జి. రమేష్, జి. శ్రీనివాసులు, నాగభూషణం, సుధీర్, కిష్టాఫర్ తదితరులు పాల్గొన్నారు.

**కలిగిరి:** ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నియంత పాలన జరుగుతుందనడానికి ఇంతకన్నా ప్రత్యక్ష సాక్ష్యాలు అవసరం లేదన్నారు. దాడికి కారకులైన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలిగిరిలో డీటీ హుస్సేనయ్యకు సోమవారం టీడీపీ నాయకులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కాకు మహేష్, పూసాల వెంగపనాయుడు, పాములూరి వరప్రసాద్, బొగ్గవరపు వేణు, కొప్పోలు కొండలరావు, కిలారి కొండపనాయుడు, అంబటి శంకర్ పాల్గొన్నారు.

**దుత్తలూరు(ఉదయగిరి రూరల్) :** ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన మీడియాపై దాడి అమానుషమని, ఇది వైసీపీ నిరంకుశత్వ పాలనకు నిదర్శనమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ పేర్కొన్నారు. అనంతపురంలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ రౌడీమూకల దాడిని ఖండిస్తూ సోమవారం దుత్తలూరులోని 565 జాతీయ రహదారిపై టీడీపీ నాయకులు నిరసన చేపట్టి నినాదాలు చేశారు. ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత మీడియాపై దాడులు పెరిగాయని, త్వరలో వైసీపీ ప్రభుత్వ పతనం తప్పదన్నారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీకుర్తి రవీంద్రబాబు, ఉదయగిరి మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మహేష్, కృష్ణయ్య, రమణారెడ్డి, శ్రీకాంత్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గుడ్లూరు : తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పాత్రికేయులు



దుత్తలూరులో 565 జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న చెంచలబాబు, టీడీపీ నాయకులు

## హెచ్‌ఐవీ నివారణపై అవగాహన



వింజమూరులో హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

**ఉదయగిరి, ఫిబ్రవరి 19:** ఎయిడ్స్ పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కళాజాత బృందం సూచించింది. సోమవారం ఉదయగిరి పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ నెల్లూరు వారి కళాజాత బృందం వీధి నాటకం ద్వారా ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించింది. ఈ కార్యక్రమంలో శ్రీనివాస క్లబ్ బృందం విజయ్, షక్ మున్ని, శ్రీనివాసులు పాల్గొన్నారు.

**వింజమూరు:** స్థానిక బస్టాండు సెంటర్‌లో సోమవారం శ్రీనివాస కళాబృందం వీధి నాటకం ద్వారా ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పి బాబురావు, స్టాలిన్, విజయ్, లింకు వర్కర్ షేక్ మున్ని, పేగు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

**కావలిటౌన్, ఫిబ్రవరి 19:** ముసునూరులోని హనుమత్ క్షేత్రంలో వెలసి ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారికి సోమవారం సింహవాహన సేవలందించారు. ఆలయ వ్యవస్థాపక అర్చకుడు వేదగిరి సూర్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీవారు సింహవాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగారు.

## వార్డు సభ్యుడి మృతికి సంతాపం

**ఉలవపాడు, ఫిబ్రవరి 19:** మండలంలోని చాగొల్లు పంచాయతీ వార్డు మెంబరు, ఎస్సీ కాలనీకి చెందిన దన్యాసి శ్రీను(46) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో ఎస్సీ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. రాష్ట్ర వడ్డెర సంఘం నాయకులు, శ్రీశైలం బోర్డు మెంబర్ తన్నీరు ధర్మరాజు, గ్రామ సర్పంచి లేళ్లపల్లి లత, పంచాయతీ పాలక మండలి సభ్యులు, గ్రామపెద్దలు శ్రీను మృతదేహానికి నివాళులు అర్పించి సోమవారం జరిగిన అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల నిరసన



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ప్రభుత్వ ఉద్యోగులు

**కావలిటౌన్, ఫిబ్రవరి 19:** ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులు సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. జేఏసీ డివిజన్ చైర్మన్ శివకుమార్ మాట్లాడుతూ మంగళవారం చలో నెల్లూరుకు జేఏసీ పిలుపునిచ్చినందున ఉద్యోగులంతా నెల్లూరు కలెక్టరేట్‌కు తరలి రావాలన్నారు. కార్యక్రమంలో ప్రమీల, మాల్యాద్రి, రాజశేఖర్, పద్మజ, రఫీ పాల్గొన్నారు.

## ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

**వరికుంటపాడు, ఫిబ్రవరి 19:** స్థానిక జాతీయ రహదారి సమీపంలో నూతనంగా నిర్మించిన పద్మావతి గోదా సమేత వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం ఘనంగా ముగిసాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్వర్ణభారత్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ ధ్వజస్తంభ, కలశ ప్రతిష్ఠ హోమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పెండ్యాల సూర్యనారాయణ ఆమెకు వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం శాంతికల్యాణం నిర్వహించి గ్రామోత్సవం చేపట్టారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



దీపావెంకట్‌కు వెంకటేశ్వరస్వామి చిత్రపటం ఇస్తున్న పెండ్యాల

## ఎన్నికల విధులపై ముగిసిన శిక్షణ

**ఉదయగిరి, ఫిబ్రవరి 19:** త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రెండు రోజులుగా ఉదయగిరి మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో జరిగిన ఎన్నికల ఎన్నికల విధులపై శిక్షణ సోమవారం ముగిసింది. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన సెక్టార్, పోలీసు అధికారులు పాటించాల్సిన నియమ నిబంధనలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్, కావలి డీఎస్పీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ

● రూ. 69 వేల రికవరీకి ఆదేశం

**సంగం, ఫిబ్రవరి 19:** మండలంలోని 20 పంచాయతీల్లో 2022 -23 ఆర్థిక సంవత్సరంలో రూ. 4 కోట్లతో ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ ఆడిట్ బృందాలు ఉపాధి హామీ పథకంలో పాల్గొన్న కూలీలను, చేసిన పనులను క్షేత్రస్థాయిలో విచారించారు. మొత్తం 20 పంచాయతీల్లో పనులు జరగగా 16 పంచాయతీల్లో సుమారు రూ. 69వేల మేర అక్రమాలు జరిగాయని సమావేశం దృష్టికి తెచ్చారు. విచారించిన అధికారులు సంబంధిత సిబ్బంది నుంచి రికవరీకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకట్రావ్, ఏపీడీ శంకరనారాయణ, అంబుడ్స్‌మెన్ వెంకట్రామిరెడ్డి, ఎంపీడీవో శేషగిరిరావు, ఇన్‌చార్జి ఏపీవో సురేష్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.



ఉపాధి హామి పథకంపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహిస్తున్న అధికారులు

## రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి : సీపీఎం

**ఆత్మకూరు, ఫిబ్రవరి 19:** పట్టణంలోని సోమశిల రోడ్డు సెంటర్ నుంచి ఆర్టీసీ డిపో వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014లో అప్పటి ప్రభుత్వం సోమశిల రోడ్డు సెంటర్ నుంచి సెయింట్ మేరీ స్కూల్ వరకు రోడ్డు విస్తరణ పనులు, భూ సేకరణకు రూ.7.80 కోట్ల నిధులు మంజూరుచేసిందని, అందులో రూ. 2.70 కోట్లు భూ సేకరణకు కేటాయించినా ఇప్పటివరకు రోడ్డు విస్తరణ పనులు జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకనైనా భూసేకరణకు న్యాయపరమైన నష్టపరిహారం చెల్లించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈమేరకు వారు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కె డేవిడ్‌రాజు, జిల్లా కౌలు రైతుసంఘం నాయకుడు జి లక్ష్మీపతి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందాని, ఏపీ రైతు సంఘం నాయకుడు లక్కు కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు

## ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

**అనంతసాగరం, ఫిబ్రవరి 19:** స్థానిక బీజేపీ కార్యాలయంలో సోమవారం ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు రాజేష్‌రెడ్డి, కిసాన్ మోర్చా నాయకులు అల్లంపాటి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు సిద్ధమా ? : ఇంటూరి

**కందుకూరు, ఫిబ్రవరి 19:** టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఎప్పుడైనా ఎక్కడైనా చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, అందుకు మీరు సిద్ధమా ? అని వైసీపీ నాయకులకు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సవాల్ విసిరారు. సోమవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వంలో అమలుచేసిన 120 సంక్షేమ పథకాలను జగన్మోహనరెడ్డి అధికారంలోకి రాగానే రద్దుచేశాడని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌కు ప్రజలు తగినబుద్ధి చెప్పటానికి , కుర్చీ మడతపెట్టి ఆయనను ఇంటికి పంపించటానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, చిలకపాటి మధుబాబు, షేక్ రఫీ, వడ్డెళ్ల రవిచంద్ర, కూనం నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.




విలేకరులతో మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

## పొగాకు తోటల పరిశీలన



క్యూరింగ్ పూర్తయిన పొగాకును పరిశీలిస్తున్న బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ తదితరులు

**కందుకూరు, ఫిబ్రవరి 19:** కందుకూరు పొగాకు వేలం కేంద్రాల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం పొగాకుబోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ పర్యటించారు. కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని దూబగుంట, మండల కేంద్రమైన పొన్నలూరు, లింగసముద్రం మండలం వీఆర్ కోట, వలేటివారిపాలెం మండలం శాఖవరం గ్రామాల్లో ఆయన పొగాకు తోటలను, క్యూరింగ్ జరుగుతున్న బ్యారన్లను, రేకల్లోని పొగాకుని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యమైన పొగాకు దిగుబడులు వచ్చేలా క్యూరింగ్‌లో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం రెండు వేలం కేంద్రాలను సందర్శించారు. అధికారులతో సమావేశాలు నిర్వహించి వేలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఆయన వెంట వేలం నిర్వహణాధికారులు రాజగోపాలరెడ్డి, చైన్‌రామ్ మీనా, రైతు ప్రతినిధులు రమణయ్య, రామకృష్ణ, వంకాయలపాటి మాల్యాద్రి, ఎం. లక్ష్మీనరసింహం తదితరులు ఉన్నారు.

## సాంకేతిక విద్యతో ఉజ్వల భవిష్యత్

**ఆత్మకూరు, ఫిబ్రవరి 19:** సాంకేతిక విద్యతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులు ఆ రంగం వైపు దృష్టి సారించాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆత్మకూరు మున్సిపాల్టీ, మండలంలోని అన్ని పాఠశాలల 8,9,10వ తరగతి విద్యార్థులకు సాంకేతిక విద్యపై ఏర్పాటుచేసిన టెక్ ఫెయిర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాలిటెక్నిక్ విద్యార్థులు తయారుచేసిన పలు నమూనాలను పరిశీలించారు. టెక్ ఫెయిర్ ఏర్పాటుచేసిన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి నాగేశ్వరరావు, అధ్యాపకులను అభినందించారు. అనంతరం స్థానిక శ్రీధర్ గార్డెన్స్‌లో నిర్వహించిన వలంటీర్ల సత్కారం కార్యక్రమంలో పాల్గొని అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## తలుపూరుపాడులో విజయీభవ యాత్ర

**సంగం :** మండలంలోని తలుపూరుపాడు, కొరిమెర్లలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సోమవారం విజయీభవ యాత్ర నిర్వహించారు. దర్గాలో పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా వేసిన సిమెంట్ రహదారిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకుడు షేక్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ జిల్లాస్థాయి సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నేతలు

**కావలిటౌన్, ఫిబ్రవరి19:** పట్టణంలోని అరుంధతీపాలెం పాఠశాల ప్రాంగణం వద్ద సోమవారం ఎమ్మార్పీఎస్ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి చేవూరు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లాస్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ కావలి నియోజకవర్గ పర్యటనపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కృష్ణ మాదిగ, ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు మందా వెంకటేశ్వర్లు, పాపయ్య, కొండయ్య, సుకుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బహుజన సమరభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 19:** కొండాపురంలో ఈనెల 23వ తేదీన జరిగే నియోజకవర్గ స్థాయి బహుజన సమరభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత, గిరిజన ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కలివెల ఎలిషాకుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ జీ ఓబులరెడ్డి, ఎంపీటీసీ తిరుపతి, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బాలిబోయిన శ్రీనివాసులు, నాయకులు ఇత్తడి రమణయ్య, ప్రసాద్, హజరత్తయ్య, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

## యర్రంరెడ్డిపల్లిలో విజయ సంకల్ప యాత్ర

**వరికుంటపాడు, ఫిబ్రవరి 19:** యర్రంరెడ్డిపల్లి, తోటలచెరువుపల్లి, పెద్దిరెడ్డిపల్లి గ్రామాల్లో సోమవారం విజయ సంకల్పయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ షేక్ అలీఅహ్మద్, పీఏసీఎస్ చైర్మన్ గుంటుపల్లి రామాంజనేయులు, మండల వైసీపీ కన్వీనర్ మందలపు తిరుపతినాయుడు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల కడుపు కొట్టొద్దు : టీడీపీ

**జలదంకి 19:** వ్యవసాయానికి ఇవ్వాల్సిన 9గంటల విద్యుత్‌ను 7 గంటలు సరఫరా చేస్తూ వైసీపీ ప్రభుత్వం రైతుల కడుపు కొడుతున్నదని మండల టీడీపీ నాయకులు ఆరోపించారు. మండల పార్టీ అధ్యక్షుడు మధు రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు సోమవారం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈ కృష్ణకిషోర్‌కు వినతి పత్రం అందించారు. రెండు గంట ల కోతతో రైతులు పడుతున్న ఇబ్బందులను ఆయనకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు భాస్కర్‌రెడ్డి, వినోద్ నాయుడు, పెంచలనాయుడు, సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌కో ఏఈకి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

## మిషన్ మోదీ బైక్ ర్యాలీకి ఘనస్వాగతం




బైక్ ర్యాలీకి స్వాగతం పలుకుతున్న బీజేపీ నేతలు

**కావలిటౌన్, ఫిబ్రవరి 19:** మిషన్ మోదీ బైక్ ర్యాలీకి సోమవారం పట్టణంలో బీజేపీ నేతలు ఘనస్వాగతం పలికారు. తమిళనాడు రాష్ట్రంలోని మధురై నుంచి ఢిల్లీ వరకు చేపట్టిన ర్యాలీకి ముసునూరు బైపాస్ రోడ్డు వద్ద బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం మద్దూరుపాడు బైపాస్ వరకు ర్యాలీ సాగింది. యువమోర్చా జిల్లా అధ్యక్షుడు గుత్తా అశోక్‌నాయుడు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో మోదీ మరోసారి ప్రధాని కావాలన్న ఉద్దేశంతో ర్యాలీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు నవీన్‌కుమార్, సీవీసీ సత్యం, కామినేని ఉదయలక్ష్మి, మందా కిరణ్, వాయుగండ్ల సుధీర్, సవీంద్ర పాల్గొన్నారు.

## నృత్య కళాభివృద్ధికి కృషి : బీఎమ్మార్

**కావలిటౌన్, ఫిబ్రవరి 19 :** నృత్య కళాభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావులు తెలిపారు. వెంగళరావునగర్‌లోని లిఖిత నృత్య కళానిలయం పునః ప్రారంభంలో సోమవారం వారు పాల్గొని నృత్యకళా శిక్షణ తరగతులు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కళానిలయం శాశ్వత భవన నిర్మాణానికి ప్రభుత్వ నిధుల నుంచి సాయమందించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో లిఖిత తండ్రి, సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, ఉపాధ్యక్షుడు గంధం ప్రసన్న, కనపర్తి రాజశేఖర్, ఖాదర్‌బాషపాల్గొన్నారు.



నృత్యకళా శిక్షణశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి, ఎంపీ బీఎమ్మార్

### రైతు సంక్షేమమే లక్ష్యం

**కావలి రూరల్:** రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కావలి మండలం గౌరవరంలో సోమవారం ఆయన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గౌరవరంలో 97 విద్యుత్ స్తంభాలను మార్చటంతోపాటు ఐదు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయించామన్నారు. అనంతరం రూ.7.70 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్మన్ కొండూరు అనీల్ కుమార్, సర్పంచి దేవరపల్లి రాధిక, వైసీపీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, విద్యుత్‌శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### అమరా బచ్చు ట్రస్ట్ సేవలు అభినందనీయం

**చిత్రగుంట :** అమరా బచ్చు చారిటబుల్ ట్రస్ట్ సామాజిక, ఆధ్యాత్మిక సేవలు అభినందనీయమని కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు యాదవ్ అన్నారు. సోమవారం బోగోలు మండలం కొండబిట్రగుంటలో ట్రస్ట్ ద్వారా నిర్మించిన భవనాల ప్రారంభోత్సవం జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొని వారు మాట్లాడారు. అనంతరం భక్తు లకు ప్రసాదాల పంపిణీ, అన్నసంతర్పణ జరిగింది. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు కృష్ణకుమార్, సర్పంచు శ్రీరామ్‌గోపాల్, జడ్పీటీసీ కీర్తన, ఎంపీటీసీ మాధవరెడ్డి, పాలక మండలి సభ్యులు ఓబుల్‌రెడ్డి, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

### యాదవ చైతన్య వేదిక నిర్మాణానికి శంకుస్థాపన

**దుత్తలూరు(ఉదయగిరి రూరల్) :** దుత్తలూరు-నర్రవాడ గ్రామాల మధ్యలో 565 జాతీయ రహదారికి పక్కన సోమవారం యాదవ చైతన్య వేదిక నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. చైతన్య వేదిక ఆవరణలో కమ్యూనిటీ హాల్, వసతిగృహం, గ్రంథాలయం నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ్య సభ్యుడు బీద మస్తాన్‌రావు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, బీసీవై పార్టీ వ్యవస్థాపకుడు బోడె రామచంద్రయాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, యాదవ అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు, అన్నా రామచంద్రయ్య, టీటీడీ బోర్డు సభ్యులు నాగం సత్యయాదవ్, టీటీడీ సన్నిధిగొల్ల కిశోర్‌యాదవ్‌తోపాటు నియోజకవర్గంలో పలువురు ప్రజాప్రతినిధులు, యాదవ సోదరులు పాల్గొన్నారు. కాగా, యాదవ చైతన్య వేదిక ఆవరణలో గ్రంథాలయంలో పుస్తకాల కొనుగోలుకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, జ్యోతి దంపతులు రూ.5 లక్షల విరాళం ప్రకటించారు.

## ఫ్లెక్సీలతో ప్రయాణికుల అవస్థలు

**ఉదయగిరి, ఫిబ్రవరి 19:** నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరిలో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్టాండ్ సెంటర్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం 45 ఏళ్ల క్రితం బస్‌షెల్టర్ నిర్మించారు. కాగా, బస్‌షెల్టర్ చుట్టూ వివిధ రాజకీయ పార్టీల జెండా దిమ్మెలు, ఫ్లెక్సీలు అడ్డంగా ఏర్పాటు చేశారు. నిత్యం అనేకమంది ద్విచక్ర వాహనాలను అడ్డంగా నిలుపుతున్నారు. దీంతో బస్‌షెల్టర్‌లోకి ప్రయాణికులు వెళ్లలేక మండుటెండలో రోడ్డుపైనే నిరీక్షిస్తున్నారు. రాత్రి పది గంటల వరకు బస్‌ల కోసం ప్రయాణికులు వేచి ఉంటారు. షెల్టర్‌లో విద్యుత్ లేక, తాగునీరు లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వసతులు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఉదయగిరి బస్‌షెల్టర్ చుట్టూ ఉన్న ఫ్లెక్సీలు

## పల్లెల్లో పేకాట జోరు

**వరికుంటపాడు, ఫిబ్రవరి 19:** మండలంలోని పలు గ్రామాల్లో మూడుముక్కలాట మూడు పువ్వులు - ఆరు కాయలుగా సాగుతున్నప్పటికీ పట్టించుకొనే నాథుడే లేడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వరికుంటపాడు, ఉదయగిరి మండలాల శివారు గ్రామాలైన సాతువారిపల్లి-కోటాయపల్లి గ్రామాల సరిహద్దులోని పొలాల్లో కొనసాగిస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతుంది. సెలవు దినాల్లో ప్రభుత్వ భవనాలు, పాఠశాలలను సైతం పేకాటకు అడ్డగా మార్చుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా ఉంచి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది.

# నెల్లూరు సిటీ, రూరల్
## కోవూరు, సర్వేపల్లి



మీడియాపై దాడిచేసిన

● నినదించిన పాత్రికేయ లోకం

# మూకలను అరెస్టు చేయాలి

అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన ముఖ్యమంత్రి సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి తెగబడ్డ వైసీపీ మూకలను తక్షణం అరెస్టు చేయాలంటూ పాత్రికేయ లోకం నినదించింది. ఫొటోజర్నలిస్ట్‌పై దాడికి నిరసనగా నెల్లూరు నగరం, రూరల్, కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో సోమవారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. దాడిని తీవ్రంగా ఖండించారు.

**నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 19 :** ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి నిరసనగా నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్‌లో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ధర్నా చేశారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఏ జయప్రకాష్ మాట్లాడుతూ గత నాలుగన్నరేళ్ల కాలంలో ప్రభుత్వం కొన్ని ప్రతికల విలేకరులను, ఫొటోగ్రాఫర్లను లక్ష్యంగా చేసుకొని దాడులు చేయిస్తోందని ఆరోపించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇలాంటి దాడులు ఎన్నడూ జరగలేదన్నారు. ఇందిరాగాంధీ వంటివారే జర్నలిస్టులకు తలవంచక తప్పలేదన్నారు. జర్నలిస్టులపై దాడి చేసిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు వల్లూరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఫొటోగ్రా ఫర్‌పై దాడి అమానుషమని, ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు కనుపర్తి దయాశంకర్, కోశాధికారి హనోక్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు రమేష్, ఫొటోగ్రాఫర్స్ అసోసియేష న్ నాయకులు జాకీర్, ముజీద్, వెంకటేశ్వరరావు, ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి నాగరాజు, స్టాఫ్ రిపోర్టర్ అమరేంద్ర, ఏబీఎన్ ప్రతినిధి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిని ఖండిస్తున్నామని టీడీపీ అధికార ప్రతినిధి సాబీర్‌ఖాన్ అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రశ్నించే మీడియా ప్రతినిధులపై దాడి క్రూరమన్నారు. సామంత రాజుల్లా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను వాడుకుంటున్నారని ఆరోపించారు. దాడికి కారకులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.



ముత్తుకూరు : బ్రహ్మదేవిలో నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

● ముఖ్యమంత్రి సమక్షంలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టుపై విచక్షణా రహితంగా దాడి చేయడం పత్రికా స్వేచ్ఛపై దాడేనని ఏపీడబ్ల్యూజేఎఫ్ తీవ్రంగా ఖండించింది. ఘటన జరిగిన తీరును భయాన్ని కల్పించేలా ఉందని ఆ సంఘం నాయకులు సుధాకర్, బాలకృష్ణ, మునీంద్ర, శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



నెల్లూరు: గాంధీబొమ్మ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న జనసేన నాయకుడు కిషోర్ తదితరులు

### దాడి దుర్మార్గం : డీవైఎఫ్ఐ

**నెల్లూరు (వైద్యం):** ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు దాడి దుర్మార్గమని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహ ఓ ప్రకటనలో ఖండించారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలుస్తున్న పత్రికలపై ఇలాంటి దాడులను తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. ఈ ప్రభుత్వంలో మీడియాకు రక్షణ లేకుండా పోయిందన్నారు. బాధ్యులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### హేయమైన చర్య : వామపక్షాలు

**నెల్లూరు రూరల్ :** ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి హేయమైన చర్య అని వామపక్ష పార్టీల నేతలు ఖండించారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూని అయిందన్నారు. రాప్తాడు ఘటనకు వ్యతిరేకంగా సోమవారం జొన్నవాడ కూడలి వద్ద సీఎం దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. సీపీఐ నేత చల్లా నరసయ్య, సీపీఎం నాయకులు ఆలూరు తిరుపాలు, పూడిపర్తి జనార్దన్, మాదిగ మహావీరుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సభలోనే ఇలాంటి విద్రోహ చర్యలు చోటుచేసుకుంటే ఇక మామూలు సమయాల్లో పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దాడి జరుగుతున్న సమయంలో పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుళ్లూరు ఆదిశేషయ్య, పాదర్తి మస్తానయ్య, తాటిపర్తి నారాయణ, ఎర్రబల్లి రవీంద్ర, ఐఎంఎల్ డిపో కార్మికులు పాల్గొన్నారు.

### ప్రజాస్వామ్యంపై దాడే...

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** మీడియా మిత్రుడిపై దాడి ప్రజాస్వామ్యం పైన జరిగిన దాడిగా పరిగణిస్తున్నామని, మీడియా మిత్రులకు జనసేన పా ర్టీ తరఫున పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ తెలిపారు. అనంతపురం జిల్లాలో ఫొటోజర్నలిస్ట్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ సోమవారం నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. దాడికి కారణమైన వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణవే ణి, రేణుక, హసీనా, వరకాపు సంక్షేమ శాఖ అధ్యక్షుడు సుధామాధవ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి హేయం

**కొడవలూరు ఫిబ్రవరి 19 :** రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకల దాడి హేయమైన చర్యని టీడీపీ మండల అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి అన్నారు. మండలంలో గుండాలమ్మపాలెంలో సోమవారం టీడీపీ నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పల్లంరెడ్డి సురేష్‌రెడ్డి, పల్లంరెడ్డి సాయి మోహన్‌రెడ్డి, దినేష్, డేగా నిరంజన్, శ్రీనివాసులు, డేవిడ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

**విడవలూరు :** ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడికి నిరసనగా సోమవారం విడవలూరులో ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెముకుల కృష్ణచైతన్య, చెముకుల శ్రీనివాసులు, మాతూరు శ్రీనివాసులురెడ్డి, ఇమాంబాషా, పొన్నాడి చంద్రశేఖర్, రామిశెట్టి వెంకటేశ్వర్లు, ఆశోక్ తదిత రులు పాల్గొన్నారు.

**బుచ్చిరెడ్డిపాళెం :** ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడిని ఖండిస్తూ వైసీపీ గూండాల్లారా ఖబడ్దార్... అంటూ టీడీపీ. బీజేపీ, సీపీఎం, జనసేన నాయకులు వైసీపీ నాయకులను హెచ్చరించారు. సోమవారం బుచ్చి బస్టాండ్ సెంటర్లో నాయకులు నిరసన వ్యక్తం చేసి ర్యాలీ నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎంవీ శేషయ్య, బత్తల హరికృష్ణ, దయాకర్‌రెడ్డి, తాళ్లస్వామి, బీజేపీ నాయకులు కాసా శ్రీనివాసులు, అఖిల్, సీపీఎం నాయకుడు సీహెచ్ మల్లికార్జున, జనసేన నాయకుడు ప్రసాద్ తదితరులు



టీపీ గూడూరు : తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జనసేన, టీడీపీ, మీడియా ప్రతినిధులు



వెంకటాచలం : నిరసన తెలుపుతున్న జనసేన పార్టీ నాయకులు

పాల్గొన్నారు. కాగా సోమవారం తహసీల్దారు కార్యాలయం దగ్గర్నుంచి చెన్నూరురోడ్డు మీదుగా గాంధీబొమ్మ వరకు జర్నలిస్టులు ర్యాలీ నిర్వహించారు.

**ఇందుకూరుపేట :** ఇందుకూరుపేటలో సోమవారం జర్నలిస్టులు నిర్వహిస్తున్న నిరసనలో జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఆయనతోపాటు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పరిశీలకులు గుడి హరికుమార్‌రెడ్డి, మాధవరెడ్డి, వై రవికుమార్, కే కృష్ణారెడ్డి, కలికొండ శశిధర్, మోహన్‌రెడ్డి, పలువురు జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

### బ్రహ్మదేవిలో టీడీపీ నేతల నిరసన

**ముత్తుకూరు, ఫిబ్రవరి 19:** రాప్తాడులో సీఎం జగన్ సభకు వచ్చిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు చేసిన దాడి దారుణమని మండల టీడీపీ నాయకులు ఖండించారు. సోమవారం బ్రహ్మదేవి కూడలిలో పత్రికా ప్రతినిధులపై వైసీపీ దాడిని ఖండిస్తూ నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఐటీ విభాగం నాయకుడు తిరుమలశెట్టి సతీష్‌నాయుడు, మైనారిటీ సెల్ నాయకుడు షేక్ అలిముత్తు, చిల్లకూరు భాస్కర్‌రెడ్డి, తుమ్మూరు విజయ్‌రెడ్డి, నాటారి నాగేంద్రబాబు, పలాల్ల రవీంద్ర, దాసరి శివ, తదితరులు పాల్గొన్నారు.

### మీడియాపై దాడి వైసీపీ పతనానికి నాంది

**తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 19:** ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై వైసీపీ నాయకుల దాడి ఆ పార్టీ పతనానికి నాంది అని టీడీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారు మాధవరెడ్డికి టీడీపీ, జనసేన నాయకులు, మండల విలేకరులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రఘుబాబు, టీడీపీ నాయకులు ముత్యాల శ్రీనివాసులు, ఇందిలాల చైతన్య, మన్యం జితేంద్ర, శాంతివర్ధన్, అవినాష్, శ్రీనాధ్, జనసేన నాయకులు శ్రీనివాసులు, రాయపు ప్రవీణ్, నారాయణ, నవీన్, వినయ్, విజయ్ పాల్గొన్నారు.

### ఫొటోగ్రాఫర్‌పై దాడి దుర్మార్గం : జనసేన

**వెంకటాచలం, ఫిబ్రవరి 19:** రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫోటో జర్నలిస్టు శ్రీకృష్ణపై దాడి దుర్మార్గమని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సయన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు అన్నారు. మండలంలోని నిడిగుంటపాలెంలో సోమవారం సాయంత్రం ఆంధ్రజ్యోతి ఫోటో జర్నలిస్టుపై జరిగిన దాడికి నిరసన తెలిపారు. కార్యక్రమంలో గుమ్మినేని వాణిభవానీ, రహీమ్, శ్రీహరి, అశోక్, తదితరులున్నారు.

## వైసీపీ పాలనకు చరమగీతం : దినేష్

**విడవలూరు, ఫిబ్రవరి 19:** రానున్న ఎన్నికల్లో వైసీపీకి చరమగీతం తప్పదని కోవూరు టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అన్నారెడ్డిపాళెంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అరాచకాలను తట్టుకోలేక పలువురు నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి హయాంలో అన్నారెడ్డిపాలెం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ప్రసన్న వల్ల నియోజకవర్గ ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మడపర్తి చంద్రమోహన్, మడపర్తి వెంకటరమణయ్య, మడపర్తి సురేష్, మడపర్తి రమేష్, జానా మహిధర్, పూడి అమరేంద్రతోపాటు 50 మంది కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి దినేష్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్లపల్లిలో ప్రతి అడుగు ప్రజల కోసం కార్యక్రమంలో పాల్గొని కరపత్రాలు అందజేశారు.

## రహదారి భద్రతా వారోత్సవాలు

**కోవూరు, ఫిబ్రవరి 19:** స్థానిక ఆర్టీసీ రీట్రేడింగ్ సమీపంలోని లారీయార్డులో సోమవారం రహదారి భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపరవాణాశాఖ ఉప కమిషనర్ చందర్ మాట్లాడుతూ రహదారి భద్రత అందరి బాధ్యతని అన్నారు. జిల్లాను రోడ్డుప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో లారీ అసోసియేషన్ అధ్యక్షుడు చిన్నారెడ్డి, కార్యదర్శి నారాయణ, ఎంవీఐ బాల మురళి, స్వప్నిల్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం పదిమంది రైతులకు జీవితబీమా బాండ్లను పంపిణీ చేశారు.

## గంగపట్నం ఆలయ ఈవోపై ఫిర్యాదు

**ఇందుకూరుపేట, ఫిబ్రవరి 19:** మండలంలోని గంగపట్నం చాముండేశ్వరిదేవి ఆలయ ఈవో బండి శాంతయ్యపై గంగపట్నం గ్రామస్థులు దేవదాయ అసిస్టెంట్ కమిషనర్‌కి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈవోను తప్పించాలని ఎమ్మెల్యే ప్రసన్నకు కూడా వైసీపీ నాయకుల ద్వారా గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఆయన తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

## ఇన్విజిలేటర్‌పై దాడి

**వెంకటాచలం, ఫిబ్రవరి 19 :** స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీలో సోమవారం లా మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఓ లా విద్యార్థి ఇన్విజి లేటర్ (అధ్యాపకుడి)పై దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో విద్యార్థికి, అధ్యాపకుడికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న యూనివర్సిటీ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి గొడవకు గల కారణాలు తెలుసుకుని ఇరువురితో మాట్లాడి సద్దుమణిగేలా చేశారు.

## జలవనరుల నిర్వహణపై ర్యాలీ

**వెంకటాచలం, ఫిబ్రవరి 19:** మండలంలోని కంటేపల్లి గ్రామంలో సోమవారం విక్రమ సింహపురి యూనివర్సిటీ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జలవనరుల నిర్వహణపై ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పర్యావరణం, విద్య, ఆరోగ్యం, బాలికల విద్య, బాల్య వివాహాలు, బాల కార్మిక సమస్య, నీటి పొదుపు వంటి పలు అంశాలపై నినాదాలు చేస్తూ గ్రామంలోని అన్ని వీధుల్లో ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్ఎం శ్రీధర్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ సునీత, అధ్యాపకుడు డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకం

**వెంకటాచలం, ఫిబ్రవరి 19:** ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకమైనదని పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కే మురళీమోహన్‌రాజు పేర్కొన్నారు. నెహ్రూ యువకేంద్ర సహకారంతో పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం వెంకటాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులందరినీ ఓటరుగా నమోదు చేసేందుకు ఎన్నికల సంఘం ప్రోత్సహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి మహేంద్రరెడ్డి, కళా శాల ఇన్‌చార్జి సురేంద్ర, మోటివేటర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## అనికేపల్లిలో అభివృద్ధి కార్యక్రమాలు

**వెంకటాచలం, ఫిబ్రవరి 19 :** మండలంలోని అనికేపల్లిలో సోమవారం సాయంత్రం పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## వైసీపీ నుంచి జనసేనలోకి భారీ చేరికలు



జనసేనలో చేరిన వారితో వేములపాటి అజయ్‌కుమార్

**ఇందుకూరుపేట, ఫిబ్రవరి 19:** మండలంలోని నాగరాజుతోపులోని వంద కుటుంబాలవారు కోవూరు నియోజకవర్గ కేర్‌టేకర్ గుడి హరికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వైసీపీని వీడి జనసేనలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్, ఆస్ట్రేలియా జనసేన కన్వీనర్ కలికొండ శశిధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనసేన నేతలకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భాగంగా కోవూరు నియోజకవర్గ పవన్‌కళ్యాణ్ యువత అధ్యక్షుడిగా కాకుమాని శ్రీకాంత్‌కు, కోవూరు నియోజకవర్గ చిరంజీవి యువత అధ్యక్షుడిగా పానేటి లోకేష్‌కు నియామక పత్రాలను అందించారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఒక గ్రామంలో మొత్తం జనసేనలో చేరడంతోనే వైసీపీ పతనం ఆరంభం అయిందన్నారు. కార్యక్రమంలో చిరంజీవి యువత నాయకులు వై.రవికుమార్, కె.కృష్ణారెడ్డి, మార్కెట్ సురేష్, జనసేన నేతలు భార్గవ్, సాయి, హరిగౌడ్, సీనియర్ నాయకులు గుండాల మాధవరెడ్డి, పాల్గొన్నారు.

## ఫ్యాన్ రెక్కలు విరగగొట్టడానికి ప్రజలు సిద్ధం



పొదలకూరు: మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

**పొదలకూరు, ఫిబ్రవరి 19:** ఫ్యాన్ రెక్కలు విరగ్గొట్టడానికి, వైసీపీని మూలకూర్చోపెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలుగుదేశం పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పొదలకూరు పంచాయతీ పరిధిలోని లింగంపల్లి, ఎస్సీ కాలనీలో బాబు షూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని జనసేన నాయకులు బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, వాణీభవానీతో కలిసి నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. లింగంపల్లి యూత్ డేగా యశ్వంత్, బోగోలు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం పొదలకూరు మాజీ సర్పంచ్ గోసు శ్యామలమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మరో రెండు నెలల్లో సర్వేపల్లికి పట్టిన మంత్రి కాకాణి అనే దరిద్రం వదులుతుందన్నారు. జనసేన సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొబ్బేపల్లి సురేష్ నాయుడు మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో జనసేన - టీడీపీ విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరి మల్లికార్జున్ నాయుడు, పులిపాటి వెంకటరత్నంనాయుడు, దేవినేని శరత్, చిరంజీవి, డేగా యశ్వంత్‌రెడ్డి, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటుపై యువతకు అవగాహన

పట్టణంలోని బోగోలు కృష్ణారెడ్డి కల్యాణ మండపంలో సోమవారం మండల టీడీపీ నాయకులు, టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత ఆధ్వర్యంలో 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పాల్గొని వివిధ కళాశాలల విద్యార్థులు, మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్న యువతకు ఓటు పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకు లు కసిరెడ్డి సుజిత్, టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షుడు కలగట్ల సందీప్, కరియావుల శ్రీనివాసులు, అజయ్‌రెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ జడపల్లి సూర్య, తెలుగు యువత నాయకులు వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి, జనసేన బొబ్బేపల్లి పాల్గొన్నారు.

## 20 కుటుంబాలు టీడీపీలో చేరిక

**వెంకటాచలం:** నెల్లూరులోని సోమిరెడ్డి క్యాంపు కార్యాలయంలో సోమవారం వెంకటాచలం మండలం కంటేపల్లి గ్రామానికి చెందిన 20 కుటుంబాలు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, నాయకులు డబ్బుగుంట గోపాలయ్య, దొడ్డక చెంచురామయ్య, అట్ల మల్లికార్జున్, డబ్బుగుంట సుధాకర్, ఆస్తోటి నాగరాజు, షేక్.రఫీ, తదితరులున్నారు.

## ప్లాస్టిక్ కవర్లను విక్రయించొద్దు

**నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 19 :** నిషేధించిన ప్లాస్టిక్ కవర్లను విక్రయించవద్దని నెల్లూరు ఏఎంసీ చైర్మన్ పేర్నేటి కోటేశ్వరరెడ్డి వ్యాపారులకు సూచించారు. ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, కేటాయించిన స్థలంలోనే దుకాణాలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఒట్టూరు సుధాకర్ యాదవ్, మార్కెట్ కార్యదర్శి నవీన్ పాల్గొన్నారు. నవాబుపేట మార్కెట్ యార్డులో జరుగుతున్న పనులను పరిశీలించారు.

## రాజరాజేశ్వరి ఆలయం ఏసీగా వెంకటసుబ్బయ్య

**నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 19 :** నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం ఈవో/సహాయ కమిషన ర్‌గా జే వెంకట సుబ్బయ్య సోమవారం బాధ్యతలు స్వీక రించారు. ఆయన గతంలో పెంచలకోన, జొన్నవాడ ఆల యాలకు సహాయ కమిషనర్‌గా పనిచేశారు. ప్రస్తుతం శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయంలో డిప్యూటీ కార్యనిర్వాహ ణాధికారిగా పనిచేస్తూ బదిలీపై నెల్లూరు వచ్చారు.

## ప్రజారంజకంగా టీడీపీ మినీ మేనిఫెస్టో : నారాయణ

**నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 19 :** తెలుగుదేశం పార్టీ మినీ మేనిఫెస్టోను ప్రజారంజకంగా రూపొందించారని మాజీ మంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ వెల్లడించారు. సోమ వారం 9, 10వ డివిజన్లలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి మినీ మేనిఫెస్టోను వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తిరుమల నాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు. కాగా, నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి 43వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో నారాయణను గెలిపించాలని కోరారు. ఏ ఇంటికి వెళ్లినా సమస్యలు, కన్నీళ్లే అన్నారు. నారాయణను గెలిపిస్తే ఇలాంటి కష్టాలు ఉండవన్నారు. కార్యక్రమంలో నాయకులు జాఫర్ షరీఫ్, సయ్యద్ ఉస్మాన్, సయ్యద్ రబ్బానీ, శ్రీదేవి, జావీద్ మొహిద్దీన్, హఫీజ్, ఫయాజ్, జియా, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యాన్ రెక్కలు విరిచేయడం ఖాయం : కోటంరెడ్డి



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కోటంరెడ్డి

**నెల్లూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) :** ప్రజల వ్యతిరేకతతో ఇప్పటికే మూలనపడిన ఫ్యాన్‌కు త్వరలోనే రెక్కలు విరిచేయడం ఖాయమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని 50వ డివిజన్‌లో ఆయన పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అండగా నిలబడాలని ప్రజలను కోరారు. వైసీపీ నేతలు టీడీపీ వైపు చూస్తుండటంతో సీఎం జగన్మోహన్‌రెడ్డికి మతిభ్రమించిందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో జగన్మోహన్‌రెడ్డి జైలుకు.. వైసీపీ బంగాళాఖాతానికి చేరడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కప్పిర శ్రీనివాసులు, ఖాదర్ బాషా, బండి ప్రసాద్, అనీల్, ముజీబ్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

### వైసీపీ పాలనతో విసిగిపోయారు...

**నెల్లూరు(వ్యవసాయం):** సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను రెక్కలు విరిచేందుకు జనం సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య అన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ విధ్వంసకర పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. రాప్తాడులో జరిగిన సీఎం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి హేయమైన చర్య అన్నారు. నెల్లూరు రూరల్‌లో ఎమ్మెల్యే కోటంరెడ్డిని మూడోసారి గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జి జలదంకి సుధాకర్, కనపర్తి గంగాధర్, నాయకులు కాకుపల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ గూటికి నాగిశెట్టి బాబూరావు

**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 19 :** నెల్లూరు రూరల్లోని 2వ డివిజన్ గుడిపల్లిపాడులో మూడు పర్యాయాలు సర్పంచ్‌గా పనిచేసిన నాగిశెట్టి బాబూరావు టీడీపీ గూటికి చేరారు. సోమవారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించినా రాష్ట్రంలో 160 సీట్లతో టీడీపీ అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్యే జోస్యం చెప్పారు.

## 'నారాయణ' నర్సింగ్ కళాశాల వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్యులు

**నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 19 :** నారాయణ నర్సింగ్ కళాశాల 19వ వార్షికోత్సవాన్ని నారాయణ వైద్య కళాశాల ఆడిటోరియంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. రోగులపై ప్రేమ, దయ, సహనంతో వైద్యసేవలు అందిస్తున్న నర్సులు అభినందనీయులన్నారు. నర్సింగ్ విద్యను పూర్తిచేసిన వారికి ఎన్నో రంగాలలో మంచి అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనజకుమారి మాట్లాడుతూ విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలంటే చక్కటి వాతావరణం అవసరమన్నారు. అందుకు తగ్గట్లు నారాయణ కళాశాలలో వసతులు ఉన్నాయని చెప్పారు. శ్రీనారాయణ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మమత మాట్లాడుతూ రాష్ట్రంలోనే నారాయణ నర్సింగ్ కళాశాలకు మంచి గుర్తింపు ఉందన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన నర్సులు దేశ, విదేశాల్లో వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు.

## మెడికల్ ఎథిక్స్‌పై అవగాహన



డాక్టర్ రమేష్‌కు స్వాగతం పలుకుతున్న మెడికో

**నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 19 :** నారాయణ వైద్య కళాశాలలో మెడికల్ ఎథిక్స్‌పై మెడికోలకు సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ రాయపు రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మెడికల్ ఎథిక్స్‌పై వివరణ ఇచ్చారు. వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి నైతిక విలువలపై సలహాలను అందించారు. నారాయణ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి మెడికల్ పోస్టుగ్రాడ్యుయేట్, ఇంటర్నల్ వైద్య వృత్తిలో నైతిక విలువల గురించి తెలియజేశారు.

## రాష్ట్ర మాస్టర్స్ బ్యాడ్మింటన్‌లో శారదకు పతకం




**నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 19 :** రాష్ట్రస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లాకు చెందిన సీనియర్ క్రీడాకారిణి కొనే శారద 45 సంవత్సరాల పైబడిన విభాగంలో మిక్స్‌డ్ డబుల్స్‌లో రజత పతకం సాధించారు. రాజమండ్రిలో ఈనెల 16 నుంచి 18 వరకు జరిగిన పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన శారద పతకం సాధించారని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నిమ్మల వీరవెంకటేశ్వర్లు తెలిపారు. గతేడాది గోవాలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ఏపీ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆమె రాష్ట్రస్థాయి పోటీల్లో విజయాలు సాధిస్తున్నారన్నారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముక్కాల ద్వారకనాథ్, జిల్లా అధ్యక్షుడు దూడల సుధాకర్ కూడా శారదను అభినందించారు.

## చంద్రబాబు మహాయజ్ఞమే సూపర్‌సిక్స్

● టీడీపీ నగర అధ్యక్షుడు మధు

**నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 19 :** అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని మొదటి స్థానంలోకి తీసుకురావాలన్న ఆలోచనలతో చంద్రబాబు ప్రకటించిన మహాయజ్ఞమే బాబూ సూపర్‌సిక్స్ అని టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ తుగ్లక్ పాలనలో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో టీడీపీని పులివెందులలోనూ గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిట్టి సత్యనారాయణ, పొత్తూరు శైలజ, కొండా ప్రవీణ్, రాజశేఖర్, మాల్యాద్రి, లక్ష్మణ్, నాని, మున్నా, పఠాన్‌బాషా పాల్గొన్నారు.

## కిమ్స్ ఆసుపత్రి రోబోటిక్ కార్ పార్కింగ్ ప్రారంభం



కార్ పార్కింగ్‌ను ప్రారంభిస్తున్న బొల్లినేని

**నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 19 :** కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నూతన రోబోటిక్ కార్ పార్కింగ్ సోమవారం ప్రారంభమైంది. దీన్ని కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌నాయుడుతో పాటు బొల్లినేని కృష్ణయ్య, బొల్లినేని శీనయ్య ప్రారంభించారు. ఆసుపత్రి ఈడీ గిరినాయుడు మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలోనే మొదటి సారిగా ఈ రోబోటిక్ కార్ పార్కింగ్‌ను నెల్లూరులో అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఇందులో 91 కార్లను పార్కింగ్ చేసుకోవచ్చని తెలిపారు. పార్కింగ్ చేయటం, బయటకు తీసుకు రావటం పూర్తిగా రోబోటిక్ విధానంలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ ఆసుపత్రి వైద్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

| | |
|---|---|
| నెల్లూరు ఏసీఎం | 9985411424 |
| నెల్లూరు ఏసీవో | 9542727676 |
| నెల్లూరు సిటీ | 8179815202 |
| నెల్లూరు రూరల్ | 8885688410 |
| కోవూరు | 8008894200 |

### ఇది ప్రజాస్వామ్యంపై దాడి



రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడి ప్రజాస్వామ్యంపై జరిగిన దాడే. ఇది అమానుషం. జగన్ తన బూటకపు ప్రసంగాలతో జనాన్ని బురిడీ కొట్టిస్తున్నారు. ఎవరిది అభివృద్ధి పాలనో.. ఎవరిది అసుద్దపాలనో ప్రజలకు తెలుసు.

**- అమరనాథరెడ్డి, మాజీ మంత్రి**




తిరుపతిలో జర్నలిస్టుల నిరసన ప్రదర్శన

### ఇప్పుడు మీడియాపై పడ్డారు



జగన్ అధికారంలోకి రాగానే తొలుత టీడీపీ నేతలు, కార్యకర్తలను లక్ష్యం చేసుకున్నారు. దాడులు, దౌర్జన్యాలతో రెచ్చిపోయారు. ఇప్పుడు ప్రజాస్వామ్య పరిరక్షకులైన మీడియా ప్రతినిధులపై పడ్డారు. ఇలాగే మనం ఊరుకుంటే రేపు ఇళ్లల్లో దూరి కొడతారు. ఆస్తులను లాక్కుని మనల్ని బికారులను చేస్తారు. ప్రజలు మేలుకోవాలి. ప్రజాస్వామ్య పరిరక్షకులైన పాలకులను వచ్చే ఎన్నికల్లో గెలిపించుకుని రాష్ట్రాన్ని ఆ దౌర్జన్యాలనుంచి రక్షించుకోవాలి. లేదంటే రాష్ట్రంలో జగనన్న రాజ్యాంగానికి బలి కావాల్సి వస్తుంది.

**- కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్సీ**

# రాక్షసరాజ్యం

**ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టుపై వైసీపీ మూకల దాడి పట్ల జిల్లావ్యాప్తంగా నిరసనలు**

**పాల్గొన్న జర్నలిస్టు, ప్రజా సంఘాలు... రాజకీయ పక్షాలు**

తిరుపతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాప్తాడు వద్ద ఆదివారం జరిగిన వైసీపీ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై అధికార పార్టీ జరిపిన అమానుష దాడి పట్ల నిరసనలు వెల్లువెత్తాయి.దాడిని ఖండిస్తూ సోమవారం జిల్లావ్యాప్తంగా జర్నలిస్టు సంఘాలు, రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు సంయుక్తంగా పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. తిరుపతిలో వివిధ జర్నలిస్టు సంఘాలు ప్రెస్ క్లబ్ నుంచీ ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద గాంధీ విగ్రహం కూడలి వరకూ భారీ నిరసన ర్యాలీ చేపట్టాయి. సంఘీభావంగా టీడీపీ, బీజేపీ, సీపీఐ, సీపీఎం,జనసేన, కాంగ్రెస్ పార్టీల నేతలు పాల్గొన్నారు.మహాత్ముడి విగ్రహం వద్ద ప్లకార్డులు, బ్యానర్లతో గంట పాటు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడిని ఖండిస్తూ, నిందితులను కఠినంగా శిక్షించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. టీడీపీ నుంచీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, సీనియర్ నేతలు ఊకా విజయ్‌కుమార్, ఆర్సీ మునికృష్ణ, ఊట్ల సురేంద్ర నాయుడు, జనసేన తిరుపతి నియోజకవర్గ ఇంచార్జి కిరణ్ రాయల్, నగర అధ్యక్షుడు రాజారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు పొనగంటి భాస్కర్, వరప్రసాద్, సీపీఎం నాయకుడు నాగరాజ, సీపీఐ నాయకుడు పెంచలయ్యలతో పాటు ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, నరేంద్ర, మీడియా ఫోటో గ్రాఫర్ల సంఘం నాయకులు గిరిబాబు, రాధాకృష్ణ, జర్నలిస్టు ఫోరం నాయకుడు హరిబాబు, జర్నలిస్టు ఫెడరేషన్ నాయకులు గోపి, మునిరాజ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం

## నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

**వామపక్షాల డిమాండు**



కలెక్టరేట్ ఎదుట వామపక్షాల ఆందోళన

తిరుపతి (కలెక్టరేట్), ఫిబ్రవరి 19: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణ మీద దాడి చేసిన వైసీపీ అల్లరి మూకలను వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు.తిరుచానూరు సమీపంలోని కలెక్టరేట్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నిరసన ప్రదర్శన నిర్వహించారు.మీడియా సిబ్బందిపై వైసీపీ దాడిచేయడం ఒక పిరికిపంద చర్య అన్నారు. రాష్ట్రంలో ఎంతటి అరాచక పాలన సాగుతోందో ఈ సంఘటన తేటతెల్లం చేసిందన్నారు.ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వామపక్ష పార్టీల నాయకులు చిన్నం పెంచలయ్య, సాయిలక్ష్మి, జయచంద్ర, సుబ్రహ్మణ్యం, సుమన్, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

## గూడూరులో కలెక్టర్‌కు వినతి పత్రం

గూడూరులో జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ జరిగింది. పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ నుంచీ ముత్యాలపేట, రైల్వే స్టేషన్ రోడ్డు మీదుగా తిరిగి టవర్ క్లాక్ వరకు ర్యాలీ నిర్వహించిన జర్నలిస్టులు అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం అక్కడే బైఠాయించి ధర్నా చేపట్టారు. అనంతరం అక్కడ నుంచీ ఆర్డీవో కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు. ఆర్డీవో కార్యాలయం వద్ద కూడా ధర్నా చేపట్టి నిందితులను శిక్షించాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఆర్డీవో కార్యాలయంలో స్పందనకు హాజరైన కలెక్టర్ లక్ష్మీశాను కలసి జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. టీఎన్ఎస్ఎఫ్, జనసేన, బీజేవైఎం, వామపక్షాలు పాల్గొని జర్నలిస్టులకు మద్దతు ప్రకటించాయి.

**జిల్లావ్యాప్తంగా జర్నలిస్టు సంఘాల నిరసనలు**

చంద్రగిరిలో తహసిల్దారు కార్యాలయం ఎదుట జర్నలిస్టులు నిరసన ప్రదర్శన నిర్వహించి డిప్యూటీ తహసిల్దారు అమృతకు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులకు మద్దతుగా టీడీపీ, బీజేపీ, బీఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తిలో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మీడియా ప్రతినిధులు ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవో శరత్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కామేష్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, పలువురు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. రేణిగుంటలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో మీడియా ప్రతినిధులు గాంధీ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించగా టీడీపీ, జనసేన, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. వెంకటగిరిలో ఉదయం జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో మీడియా ప్రతినిధులు గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించగా సాయంత్రం టీడీపీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించి అక్కడ నుంచీ క్రాస్ రోడ్డు వరకూ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఇందులో మీడియా ప్రతినిధులతో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. సూళ్ళూరుపేటలో గాంధీ విగ్రహం నుంచీ ఆర్టీసీ బస్టాండు, అంబేద్కర్ సర్కిల్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకూ జర్నలిస్టులు ర్యాలీ నిర్వహించారు. అయితే కార్యాలయంలో ఆర్డీవో అందుబాటులో లేకపోవడంతో తహసిల్దారు కార్యాలయం చేరుకుని అక్కడున్న ఆర్డీవో చంద్రమునికి వినతిపత్రం అందజేశారు.సత్యవేడులో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం అక్కడ నుంచీ జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని నినాదాలు చేస్తూ పోలీస్ స్టేషన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. స్టేషన్‌లో సిబ్బందికి వినతి పత్రం అందజేసి అక్కడ నుంచీ తహసిల్దారు కార్యాలయం చేరుకుని డీటీ రవిచంద్రబాబుకు వినతి పత్రం అందజేశారు. ప్రెస్ క్లబ్ నాయకులు రామచంద్రయ్య, త్యాగరాజు తదితరులతో పాటు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. వరదయ్యపాలెంలో పాత్రికేయులు ఆర్టీసీ బస్టాండు వద్ద ధర్నా చేపట్టి జర్నలిస్టులపై దాడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అక్కడి నుంచీ తహసిల్దారు కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. జర్నలిస్టు నాయకులు నయీమ్, ఉమామహేష్‌లతో పాటు టీడీపీ నాయకుడు నిర్మల్ కుమార్, సీపీఐ నాయకుడు చిన్నరాజులు పాల్గొన్నారు.



## చిన్నప్పటి నుంచే తిరుమలకు వస్తున్నా

**హీరోయిన్ శ్రీలీల**

తిరుమల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : చిన్నప్పటి నుంచీ తరచూ తిరుమలకు వచ్చి వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం తనకు అలవాటని హీరోయిన్ శ్రీలీల చెప్పారు.సోమవారం ఉదయం ఆమె తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.అనంతరం ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ..కుటుంబ సమేతంగా శ్రీవారిని మరోమారు దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తెలుగుతో పాటు తనకు వివిధ భాషల్లో అవకాశాలొస్తున్నాయని,త్వరలో అన్ని వివరాలనూ ప్రకటిస్తానన్నారు. కాగా, ఆలయం ముందు శ్రీలీలను చూసేందుకు యాత్రికులు ఎగబడ్డారు.ఆమెతో కలిసి సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు.

## డిజిటల్ బోధన ఎలా వుంది?

గూడూరు, ఫిబ్రవరి 19 : గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి కలెక్టర్ లక్ష్మీశ హాజరై వినతులను స్వీకరించారు.జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలోని ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌ను, పోలింగ్ కేంద్రాలను పరిశీలించాక డిజిటల్ క్లాస్‌లో విద్యా బోధనను ఆయన పరిశీలించారు.విద్యార్థులతో కలిసి వెనుక బెంచీలో కూర్చొని బోధనపై వారిని ఆరా తీశారు.



## ఐఐటీ, ఐసర్ నేడు జాతికి అంకితం

ఏర్పేడు, ఫిబ్రవరి 19 : ఏర్పేడు వద్ద ఉన్న ఐఐటీ, ఐసర్‌లను కేంద్రప్రభుత్వం జాతికి అంకితం చేయనుంది. కేంద్రీయ విద్యాసంస్థలయిన భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థకు మేర్లపాక రెవెన్యూ పరిధిలో 560 ఎకరాలను, భారతీయ విజ్ఞాన శిక్షణ, మరియు పరిశోధన సంస్థకు జంగాలపల్లి రెవెన్యూ శ్రీనివాసపురం పంచాయతీలో 268 ఎకరాలను గత టీడీపీ ప్రభుత్వంలో కేటాయించిన విషయం తెలిసిందే.అప్పటినుంచీ జరుగుతున్న భవన నిర్మాణాలు ఇటీవల పూర్తయిన సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్నారు. ఈ సందర్భంగా తిరుపతి ఐఐటీలో ఏర్పాట్లు చేసినట్లు ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య తెలిపారు.

## ఏసీబీ వలలో వీఆర్వో

కేవీబీపురం, ఫిబ్రవరి 19 : కేవీబీపురం మండలంలోని కోవనూరు వీఆర్వోగా పని చేస్తున్న మునిరాజ సోమవారం ఓ రైతు వద్ద రూ.5వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఏసీబీ ఏఎస్పీ దైవప్రసాద్ కథనం మేరకు ..కర్లపూడి గ్రామానికి చెందిన శేఖర్ విద్యుత్ కనెక్షన్ నిమిత్తం వాల్టా సర్టిఫికెట్ కావాలంటూ సంవత్సర కాలంగా తిరుగుతున్నాడు.చివరకు వీఆర్వో మునిరాజ రూ.20వేలు డిమాండ్ చేయడంతో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు.వారిచ్చిన సమాచారంతో కేవీబీపురంలోని ఒక కూల్‌డ్రింక్ దుకాణంలో రైతు శేఖర్ నుంచి రూ.5వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.మునిరాజపై కేసు నమోదు చేశారు.డీఎస్పీ ప్రశాంతి, ఇన్‌స్పెక్టర్లు ఈశ్వర్, సునీల్ కుమార్, ఎల్‌వీ నాయుడు, ఎస్ఐ సూర్యనారాయణ తదితరులు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.



లంచం డబ్బుతో పట్టుబడిన వీఆర్వో మునిరాజ

## శ్రీకాళహస్తి పోలీసులకు హడల్

● **నిద్రావస్థ నుంచి మేల్కొని పరుగులు పెడుతున్న అధికారులు**

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19: శ్రీకాళహస్తి మండల పరిధిలో పలు అక్రమాలపై ఎస్పీ మలిక గార్గ్ నేరుగా దృష్టిపెట్టారు. గొల్లపల్లి వద్ద పెద్దఎత్తున కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు ఆదివారం సాయంత్రం ఎస్పీ పక్కా సమాచారం సేకరించారు. స్థానిక అధికారులకు విషయం పొక్కకుండా ఆర్ఎస్ఐ సుబ్బరాజుతో స్పెషల్ పార్టీ బృందాన్ని రంగంలోకి దింపారు. పది కోళ్లు, ఒక ద్విచక్ర వాహనంతో సహా ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై ఆదివారం రాత్రి శ్రీకాళహస్తి రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు.ఎస్పీ నేరుగా దృష్టి సారించిన విషయం తెలిసి పోలీసు అధికారులు సోమవారం వారి వారి పరిధిలో పరుగులు తీశారు. శ్రీకాళహస్తి మండలంలో పెద్దఎత్తున కోడి పందేలు జరుగుతున్నట్లు చాలాకాలంగా విమర్శలున్నాయి. ముఖ్యంగా కేపీ చింతల గ్రామంలో పెద్ద ఎత్తున నగదు చేతులు మారుతుందని ప్రచారం. అలాగే మరికొన్ని స్థావరాలపై కూడా ఎస్పీ దృష్టి పెట్టారు.శ్రీకాళహస్తి రూరల్‌లో స్పెషల్ పార్టీ బృందం దాడి చేయడంతో మిగతా అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం తొట్టంబేడు పోలీస్‌స్టేషన్ పరిధిలో కోడిపందేల స్థావరంపై దాడులు చేశారు.

## నేడు నారా భువనేశ్వరి కుప్పం రాక

● **గుడుపల్లెలో మృతుల కుటుంబాలకు పరామర్శ**

కుప్పం, ఫిబ్రవరి 19: టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు ఎండీ నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' యాత్రకు మంగళవారం కుప్పం వస్తున్నారు. చంద్రబాబు జైలుకు వెళ్లినప్పుడు తట్టుకోలేక జిల్లాలో మరణించిన వారి కుటుంబాలను పరామర్శించనున్నారు. ఈమె పర్యటన వివరాలను సోమవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం కుప్పంలో మీడియకు వివరించారు. గుడుపల్లె మండలం కొడతనపల్లె గ్రామంలో మృతుడు టి.వెంకటేశ్ కుటుంబాన్ని మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు పరామర్శిస్తారని పేర్కొన్నారు. 3 గంటలకు గుడుపల్లె ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌కు చేరుకుని అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తారన్నారు. అనంతరం మల్లప్ప కొండపై మల్లేశ్వరస్వామిని దర్శించుకుంటారన్నారు. సాయంత్రం 6.35 గంటలకు యామగానిపల్లెలో జి.వెంకటేశులు కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెబుతారని వివరించారు. అనంతరం కుప్పం చేరుకుని హెబ్రోను చర్చిలో ప్రార్థనల్లో పాల్గొంటారన్నారు. అక్కడినుంచి చంద్రబాబు పీఏ మనోహర్ ఇంటికి వెళ్లి ఆయన్న పరామర్శిస్తారన్నారు. రాత్రి ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో బస చేస్తారు. 'బుధవారం ఉదయం 10.10 గంటలకు శాంతిపురంలో మహిళలతో ముఖాముఖిలో నారా భువనేశ్వరి పాల్గొంటారు. 11.20 గంటలకు ఎన్టీఆర్ సర్కిల్‌కు చేరుకుని అన్న క్యాంటీన్ ప్రారంభిస్తారు. అక్కడ్నుంచి రామకుప్పం చేరుకుని పోలీసు స్టేషన్ పక్కనే అన్న క్యాంటీన్ ప్రారంభిస్తారు. మధ్యాహ్న భోజనం తర్వాత పెద్దపంజాణి మండలానికి బయలుదేరి వెళతారు' అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### 22న పులిచెర్లలో పర్యటన

**కల్లూరు:** 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా నారా భువనేశ్వరి ఈనెల 22న పులిచెర్ల మండలంలో పర్యటిస్తున్నట్లు పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి సోమవారం తెలిపారు. చంద్రబాబు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక మృతిచెందిన వారి కుటుంబాలను పరామర్శిస్తారన్నారు. ఇలా 22న మధ్యాహ్నం 12 గంటలకు కమ్మపల్లికి చెందిన టీడీపీ వీరాభిమాని వెంకటపతి నాయుడు కుటుంబాన్ని.. ఒంటి గంటకు గడ్డంవారిపల్లి పంచాయతీ పగడాలవారిపల్లికి చెందిన టీడీపీ నేత దొరస్వామి కుటుంబసభ్యులను పరామర్శిస్తారన్నారు.

## పట్టాలు తప్పిన గూడ్స్

**ఆలస్యంగా నడిచిన పలు రైళ్లు**



గూడ్స్ రైలు పునరుద్ధరణ పనులు

రేణిగుంట,ఫిబ్రవరి 19 : రేణిగుంట రైల్వే స్టేషన్ దక్షిణం వైపు యార్డులో ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. చెన్నయ్‌లోని మేల్పాకం నుంచి కార్ల లోడ్‌తో అసోంలోని ఛాంగ్‌సరికెకు వెళుతున్న గూడ్స్ రైలు సోమవారం రాత్రి 9.15 గంటలకు పట్టాలు తప్పింది.రేణిగుంట స్టేషన్ లోని రోడ్డు నెంబరు సెవెన్‌లోకి వెళుతున్న సమయంలో ఇంజన్ నుంచి మూడవ పెట్టె క్రాసింగ్ వద్ద పట్టాలు తప్పింది.గత ఏడాది కాలంలో ఇదే ప్రాంతంలో మూడుసార్లు ప్రమాదాలు జరగడం గమనార్హం. హుటాహుటిన యాక్సిడెంట్ రిలీఫ్ వ్యాన్ సిబ్బంది అక్కడకు చేరుకొని పునరుద్ధరణ పనులు చేపట్టారు.సీడీవో ప్రణయ్‌కుమార్,ఐటీఎఫ్ సందీప్ కుమార్‌లతో పాటు పలువురు అధికారులు పనులను పర్యవేక్షించారు. ప్రధానరైలుమార్గంలో ప్రమాదం జరగడంతో చెన్నై నుంచి విశాఖ పట్టణం, ముంబాయి, తిరుపతి, భువనేశ్వర్‌లకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లు గంటల కొద్దీ ఆలస్యంగా నడిచాయి.ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

# గూడూరు
## సూళ్లూరుపేట/వెంకటగిరి

## అభివృద్ధిని గాలికొదిలేసిన జగన్: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 19: ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రాభివృద్ధిని గాలికొదిలేశారని, సంక్షేమం మాటున అవినీతి, అక్రమార్జనతో దోచుకుంటున్నారని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం విమర్శించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ అరాచకాలతో విసిగిపోయిన జనం రాబోవు ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిచేయడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకపోగా అప్పుల పాలు చేసి తీవ్ర సంక్షోభంలోకి నెట్టేశారని విమర్శించారు. సంక్షేమం అంటూ పది రూపాయలు చేతికి ఇచ్చి వంద లాగేస్తున్నాడని, అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను సైతం పక్కదోవ పట్టించి పేదల వర్గాల అభ్యున్నతిని అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. గత టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా రుణాలు మంజూరు చేయడమే కాకుండా కులవృత్తిదారులకు పనిముట్లు అందజేసి ఆదుకున్నారని గుర్తు చేశారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ రౌడీ మూకల దాడిని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సంచి కృష్ణయ్య, శోభన్‌నాయుడు, ప్రసాద్ నాయుడు, సాయికుమార్, కృష్ణమనాయుడు, వెంకటేశ్వర్లు, రాధానాయుడు, దార్ల రాజేంద్ర, వాసు, సుజాతమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మాయలమారి ప్రభుత్వాన్ని గద్దె దించాలి



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 19: మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దెదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కందలి, చెమిర్తి గ్రామాల్లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పలువురు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనలో దౌర్జన్యాలు, దాడులు పెరిగిపోయాయన్నారు. సీఎం సభలోనే మీడియా ప్రతినిధులపై దాడులు జరుగుతుంటే సామాన్యులకు రక్షణ ఎలా వుంటుందని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కోట్ల రూపాయల సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారని తెలిపారు. చంద్రబాబునాయుడుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని, రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, దుద్దా రామవరెడ్డి, మట్టం శ్రావణి, కృష్ణయ్య, శ్రీనివాసులురెడ్డి, సురేంద్ర, వెంకటేశ్వర్లు, సురేష్, రత్నం, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రముని

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 19: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో చంద్రముని అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో విధుల్లో నిర్లక్ష్యం తగదని, అన్ని గ్రామాల్లో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు పక్క ప్రణాళికతో పనిచేయాలని అన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని, ఎటువంటి లోటుపాట్లు ఉండకూదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపాలకృష్ణ, డీటీ చైతన్య, ఎన్నికల డీటీ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ సత్యాలు చెప్పడం మానుకోవాలి: టీడీపీ



సమావేశంలో టీడీపీ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 19: సీఎం జగన్ అసత్యాలు చెప్పడం మానుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ హితవు పలికారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో సీఎం జగన్ మాట్లాడుతూ సైకిల్ బయట ఉండాలి.. గ్లాసు సింక్‌లో ఉండాలి.. అని ఏవేవో ప్రగ్భాలాలు పలుకుతున్నారని, ఇప్పటికే అరాచక పాలనతో విసిగిపోయిన ప్రజలు ఫ్యాన్ రెక్కలను విరిచివేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. చేసిన అభివృద్ధి గురించి మాట్లాడాలే కానీ, అసత్య ప్రచారాలు చేయడం మంచిపద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య, రవీంద్రరెడ్డి, నరసింహులు, వాటంబేడు శివకుమార్, పులిమి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీలో చేరిక

వెంకటగిరి, ఫిబ్రవరి 19: సైదాపురం అరుందతీయవాడకు చెందిన మాజీ ఎంపీటీసీ పందిటి పాపయ్య ఆధ్వర్యంలో పలువురు వైసీపీ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

## ఆసరా చెక్కుల పంపిణీ

చిట్టమూరు, ఫిబ్రవరి 19: మండలంలోని పొదుపు సంఘాల మహిళలకు సోమవారం ఆసరా చెక్కులను ఎమ్మెల్సీ మేరిగ మురళి పంపిణీ చేశారు.



## షార్ ఉద్యోగి ఆత్మహత్య



జగన్నాథం (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 19: సూళ్లూరుపేట పట్టణంలోని షార్ ఉద్యోగుల కాలనీ పులికాట్ నగర్‌లో విషాదం చోటు చేసుకొంది. షార్‌లోని ఎస్ఎంపీసీలో సీనియర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న జి.జగన్నాథం(38) తను నివాసం ఉంటున్న పులికాట్ నగర్ సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కొంతకాలంగా ఆయన మానసిక పరిస్థితి బాగాలేదని, దీంతో ఆత్మహత్య చేసుకొన్నారని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరూ పిల్లలు ఉన్నారు.

## బైక్‌ను ఢీకొన్న లగేజీ ఆటో
### ఒకరి మృతి

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 19: పట్టణంలోని తుమ్మూరు సమీపంలో మోటారు సైకిల్‌ను లగేజీ ఆటో ఢీకొన్న సంఘటనలో అంకయ్య(41) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... ఓజిలి మండలం సగుటూరుకు చెందిన అంకయ్య నాయుడుపేట పట్టణంలో నివాసం ఉంటున్నాడు. సోమవారం తన స్వగ్రామానికి మోటారు సైకిల్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా తుమ్మూరు సమీపంలో ఎదురుగా వస్తున్న లగేజీ ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అంకయ్యను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## స్కూటర్‌ను ఢీకొన్న కారు
### ఒకరికి గాయాలు

డక్కిలి, ఫిబ్రవరి 19: స్కూటర్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు కథనం మేరకు... రాపూరు మండలం చెల్లటూరుకు చెందిన బక్కా సుధాకర్ డక్కిలిలో బేల్దారి పనులు ముగించుకొని స్కూటరుపై ఇంటికి బయలుదేరాడు. డక్కిలి ప్రభుత్వాస్పత్రి వద్ద వెళ్తుండగా కారు ఢీకొంది. సుధాకర్ తలపై బలమైన రక్త గాయం కావడంతో స్థానికులు పక్కనే వున్న ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా వుండటంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. కారు డ్రైవరు సురేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

## చర్చిలో చోరీ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 19: మండల పరిధిలోని సామంతమల్లాం చర్చిలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. చర్చి తాళం పగళగొట్టి లోపల ఉన్న యాంప్లీప్లేయర్, సౌండ్ సిస్టం పరికరాలతో పాటు కానుకల గల్లా పెట్టెను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం స్థానికులు గమనించి పాస్టర్ సుధీర్ కుమార్‌కు సమాచారం అందించారు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.





గూడూరులో టవర్‌క్లాక్ సెంటర్ వద్ద మీడియా ప్రతినిధుల ర్యాలీ - వెంకటగిరిలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల

# మీడియా ప్రతినిధులకు రక్షణ కరువు

గూడూరు, ఫిబ్రవరి 19: రాష్ట్రంలో మీడియా ప్రతినిధులకు రక్షణ కరువైందని, ప్రజాస్వామ్యంలో ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న విలేకరుపై దాడులకు పాల్పడడం హేయమైన చర్య అని జర్నలిస్టు సంఘాల నేతలు అన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం జరిగిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడాన్ని నిరసిస్తూ సోమవారం గూడూరులో మీడియా ప్రతినిధులు నిరసన తెలిపారు. పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్ నుంచి ముత్యాలపేట, రైల్వేస్టేషన్ రోడ్లు మీదుగా ర్యాలీ నిర్వహించారు. టవర్‌క్లాక్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ధర్నా చేపట్టారు. వీరి నిరసనకు టీఎస్ఎస్ఎఫ్, జనసేన, బీజేవైఎం, వామపక్ష నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న విలేకరులపై దాడులకు పాల్పడడం మంచి పద్ధతికాదన్నారు. దెందులూరు, రాప్తాడు సభల్లో విలేకరులపై వైసీపీ నాయకులు దాడులు చేసినా ప్రభుత్వ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. ఈ తరహా దాడులు పునావృతం కాకుండా నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. అనంతరం టవర్‌క్లాక్ సెంటర్ నుంచి ప్రదర్శనగా సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. స్పందన కార్యక్రమంలో పాల్గొనేందుకు గూడూరుకు వచ్చిన కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, టీఎన్ఎస్ఎఫ్, జనసేన, బీజేవైఎం, వామపక్ష నాయకులు పాల్గొన్నారు.

**వెంకటగిరి:** రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తోందని, ప్రజలకు, మీడియాకు రక్షణ లేకుండా పోయిందని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు చేసిన దాడికి నిరసనగా వెంకటగిరిలో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలో రాజ్యాంగాన్ని కాపాడాలని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, పునుగోటి విశ్వనాథ నాయుడు, శ్రీరాందాస్ గంగాధర్, పోలంరెడ్డి కోటేశ్వరెడ్డి, కొండ్లపూడి రాఘవరెడ్డి, కాపా శ్రీనివాసులు నాయుడు, తాండవ చంద్రారెడ్డి, నరసింహులు, కొల్లాపూరు సుధ, చంగారావు, జానసాటి బాలకృష్ణ, రాపూరు శ్రీనివాసులు, హేమంత్ చౌదరి, సుకుమార్, నానీ, చంటీ తదితరులు పాల్గొన్నారు.

**వెంకటగిరి టౌన్:** ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేసే మీడియా ప్రతినిధులపై దాడిచేయడం అమానుషమని ఏపీడబ్ల్యూజే యూనియన్ నాయకులు అన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం జరిగిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడాన్ని నిరసిస్తూ స్థానిక గ్రంథాలయం వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**తడ:** సూళ్లూరుపేటలోని గాంధీ, అంబేడ్కర్ విగ్రహాల వద్ద ఏపీయూడబ్ల్యూజే, జర్నలిస్టు సంఘాలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపాయి. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడులకు పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీయుడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు ఎంఎస్ రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై విక్షిక్షణారహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరచిన వారిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. అక్కడ నుంచి ఆర్డీవో ఆఫీసు మీదుగా తహసీల్దారు కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో చంద్రమునికి, తహసీల్దారు గోపాలకృష్ణకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే కార్యవర్గ సభ్యుడు కిరణ్, జర్నలిస్టులు దేవేంద్రరెడ్డి, వేణుగోపాల్, మొలకల రమణయ్య, రమేష్, గల్లా శ్రీనివాసరావు, సునీల్, భాస్కర్, మూర్తి, జోసఫ్, గజేంద్ర, సురేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

**నాయుడుపేట:** రాష్ట్రంలో మీడియా ప్రతినిధులపై దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని ఏపీజేయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకుమాను వెంకటవేణు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదంశెట్టి శేఖర్‌బాబు అన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం జరిగిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడిని వారు ఖండించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాని కోరారు.

**పెళ్లకూరు:** రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు హేయమైన చర్య అని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి అన్నారు. మీడియా ప్రతినిధులపై దాడులకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.





సూళ్లూరుపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద జర్నలిస్టుల నిరసన - వెంకటగిరిలో గాంధీజీ వినతిపత్రం ఇస్తున్న మీడియా ప్రతినిధులు

## భూవివరాల నమోదులో అవకతవకలకు పాల్పడితే చర్యలు: కలెక్టర్



దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

గూడూరు, ఫిబ్రవరి 19: భూ వివరాల నమోదులో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించి పలువురి నుంచి వినతులు స్వీకరించారు. గూడూరు పట్టణానికి చెందిన మస్తానయ్య అనే దివ్యాంగుడు తనకు ట్రైసైకిల్, అంత్యోదయ రేషన్‌కార్డు ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించాడు. వెంటనే స్పందించిన కలెక్టర్ ట్రైసైకిల్‌ను తెప్పించి మస్తానయ్యకు అందజేశారు. అంత్యోదయ కార్డు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో శిథిలావస్థకు చేరిన అంబేడ్కర్ భవనాన్ని అభివృద్ధి చేయాలని న్యాయవాది అరవ పార్వతయ్య వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు విన్నవించుకునేందుకు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా, తానే నేరుగా సమస్యలను విని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. ఇకపై జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఇక్కడ మొత్తం 134 అర్జీలు అందగా, భూ సమస్యలపై ఎక్కువగా వినతులు వచ్చాయన్నారు. అర్జీదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే 18 ఏళ్లు నిండిన వారు తప్పనిసరిగా ఓటుగా నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం స్థానిక జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలోని ఈవీఎం ఇంటర్మీడియేటరి స్ట్రాంగ్‌రూమ్, పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అధికారులకు ఓటర్ల జాబితాలో మృతుల పేర్లు, డబుల్ ఎంట్రీలను తొలగించాలని, ఫొటోలు స్పష్టంగా లేనివారివి సేకరించి అప్‌డేట్ చేయాలని సూచించారు. అనంతరం భవిత పాఠశాలను, డిజిటల్ క్లాస్‌లో విద్యా బోధనను తనిఖీ చేశారు. తరగతి గదిలో విద్యార్థులతో కలిసి వెనుక బెంచీలో కూర్చొని విద్యా సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. బోధనా విధానం గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్‌కుమార్, డీఎల్‌డీవో వాణి, రూరల్ సీఐ వేణుగోపాలరెడ్డి, ఎస్‌ఐ మనోజ్‌కుమార్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

## పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తే పతనం తప్పదు



నిరసన తెలుపుతున్న సురేష్‌బాబు

కోట, ఫిబ్రవరి 19: పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తే పతనం తప్పదని తిరుపతి పార్లమెంటు టీడీపీ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి తీగల సురేష్‌బాబు అన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం జరిగిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. ఆంధ్రజ్యోతి పత్రికను చూపిస్తూ నిరసన తెలిపారు. సీఎం జగన్ అరాచకాలను ప్రజలు గుర్తిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో వైసీపీని పాతాలానికి తొక్కేయడం ఖాయమని సురేష్‌బాబు అన్నారు.

## స్థల వివాదంపై సీబీఐ విచారణ కోరతాం: కౌన్సిలర్లు

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 19: పట్టణంలోని ఎన్‌జేఆర్ సర్కిల్ వద్ద సర్వే నెం. 227.10లో 48 సెంట్ల భూమి వివాదంపై సీబీఐ విచారణ కోరతామని వైసీపీ కౌన్సిలర్లు ఆరి శంకరయ్య, ధనియాల రాధ, ఎంవీ నారాయణ, షేక్ వహిదా అన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్ఎల్ఆర్ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించిన గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ వెంకటగిరి పట్టణంలో ఎన్‌జేఆర్ సర్కిల్ వద్ద సర్వే నెం. 227.10లో 48 సెంట్ల భూమికి సంబంధించి కోర్టు ఉత్తర్వులను వెల్లడించారు. వైసీపీ కౌన్సిలర్లు జోక్యం చేసుకుని వివాదాస్పద భూమి ప్రైవేటు వ్యక్తులకు చెందుతుందని మీరెలా చెబుతారంటూ ఆర్డీవోను ప్రశ్నించారు. ఈ భూమిపై ప్రజాదర్బార్ ఏర్పాటు చేసి ప్రజల అభిప్రాయాలను స్వీకరించాలని డిమాండ్ చేశారు. ఆర్డీవో స్పందిస్తూ త్వరలోనే ప్రజాదర్బార్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాంబశివరావు, కమిషనర్ బీవీ రమణయ్య పాల్గొన్నారు.

## ఫేస్‌బుక్ ప్రేమికులు.. ఒక్కటయ్యారు..!

పాలసముద్రం, ఫిబ్రవరి 19: ఫేస్‌బుక్ పరిచయం.. ప్రేమగా మారి ఒకటైందా జంట. పాలసముద్రం మండలం గంగమాంబాపురం గ్రామానికి చెందిన దీపిక (19)కి తల్లిదండ్రులు పెళ్లి నిశ్చయం చేశారు. మరో 10 రోజుల్లో పెళ్లి జరగాల్సి వుంది. ఈ క్రమంలో ఫేస్‌బుక్ పరిచయంతో ప్రేమికుడిగా తిరుపతి జిల్లా తడ మండలం రామాపురం గ్రామానికి చెందిన విఘ్నేష్ వద్దకు ఈనెల 15న వెళ్లిపోయింది. మేజర్లయిన వీరిద్దరూ వివాహం చేసుకున్నారు. తల్లిదండ్రులకు విషయం తెలియకపోవడంతో దీపిక కనిపించడం లేదని పాలసముద్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఆ జంట ఆచూకీ తెలుసుకున్నారు. సోమవారం స్టేషన్ హౌస్ ఆఫీసర్ జానకిరామ్ ఇరువురు తల్లిదండ్రులతో మాట్లాడి, ఇద్దరూ మేజర్లు కావడంతో డీటీ మధుబాబు ఎదుట హాజరు పరిచారు. దీపిక తాను ప్రేమికుడి వెంటనే వెళతానని చెప్పడంతో తల్లిదండ్రులు మిన్నకుండి పోయారు.



ప్రేమికులతో మాట్లాడుతున్న డీటీ

## ఆకతాయిల అడ్డాగా బస్టాండ్

బాలాయపల్లి, ఫిబ్రవరి 19: బాలాయపల్లిలోని ఆర్టీసీ బస్టాండ్ ఆకతాయిలకు అడ్డాగా మారిందని స్థానికులు చెబుతున్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో బాలాయపల్లి, గూడూరుతో పాటు ఇతర మండలాలకు చెందిన విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రతిరోజు పాఠశాల ముగిసే సమయంలో కొంతమంది ఆకతాయిలు మోటారు బైకులు, ఆటోల్లో వచ్చి విద్యార్థినిలను అల్లరి చేయడం పరిపాటిగా మారింది. ఈ విషయంపై గతంలో పలుమార్లు పోలీసుల దృష్టికి తీసుకెళ్లిన చర్యలు తీసుకోకపోవడంతో రోజురోజుకు ఆకతాయిల చేష్టలు పెచ్చుమీరుతున్నాయని స్థానికులు అంటున్నారు. పోలీసులు స్పందించి ఆకతాయిలు ఆగడాలను అరికట్టాలని కోరుతున్నారు.

## ఓటే వజ్రాయుధం

వెంకటగిరి, ఫిబ్రవరి 19: వైసీపీ అరాచక పాలనను గద్దె దింపాలంటే యువత తమ ఓటును వజ్రాయుధంగా మలుచుకోవాలని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు అన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని వీఆర్‌జేసీ మహిళా డిగ్రీ కలాశాలలో మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ అనే కార్యక్రమం నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన విద్యార్థులందరూ విధిగా తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. టీఎన్ఎస్ఎఫ్ నాయకులు హేమంత్ చౌదరి, సుకుమార్, నానీ, నాయకులు మచ్చల వేణు, తిరుపతినాయుడు పాల్గొన్నారు.

## పాఠశాలలో తనిఖీలు

కోట, ఫిబ్రవరి 19: మండల పరిధిలోని ఉత్తమనెల్లూరులోని ప్రభుత్వ పాఠశాలను ఎంఈవో దారా మస్తానయ్య సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. చేశారు. విద్యార్థులకు సామర్థ్య పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనపరచిన వారిని అభినందించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో కలసి భోజనం చేశారు.

## రాష్ట్రంలో దమనకాండ

చిట్టమూరు, ఫిబ్రవరి 19: సీఎం జగన్ అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో దమనకాండ మొదలైందని టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు అన్నారు. సోమవారం కోగిలి గ్రామంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహిం చారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, గుంపర్ల చిన్నారావు, రషీద్, గిరినాయుడు, చెంచురామయ్య, కల్లూరు మణి తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీని గెలిపించండి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న పాశిం సంధ్యారాణి

గూడూరు, ఫిబ్రవరి 19: రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. సోమవారం స్థానిక గమళ్లపాళెంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహాశక్తి పథకం ద్వారా చంద్రబాబు నాయుడు మహిళలకు అనేక సంక్షేమపథకాలను అమలు పరుస్తారన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, శివకుమార్, శివప్రసాద్, బిల్లు చెంచురామయ్య, గోను శివకుమార్, శంకరయ్య, చంద్రమౌళి, గురవయ్య, జనార్దన రెడ్డి, రమణయ్య, అమరయ్య, ప్రణీత్, భారతి, సుబ్బమ్మ, జనసేన నాయకులు తీగల చంద్రశేఖర్, మోహన్, విష్ణు, శివ, శ్రీనాథ్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించాలి




సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఐక్యవేదిక సభ్యులు

గూడూరు, ఫిబ్రవరి 19: రానున్న ఎన్నికల్లో ఈవీఎంలతో కాకుండా బ్యాలెట్ పేపర్ల ద్వారా పోలింగ్ నిర్వహించాలని భారత లౌకిక రాజ్యాంగ పరిరక్షణ ఐక్యవేదిక నాయకులు అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రజలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై సందేహాలు ఉన్నాయన్నారు. ఈవీఎంలలో ఓటర్ల తీర్పును తారుమారు చేసే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రభాకర్, కాలేషా, రవి రాఘవేంద్ర, విజయ్‌కుమార్, శశికుమార్, సీవీఆర్‌కుమార్, జమాలుల్లా, సుబ్బరామరాజు, అరవ పార్వతయ్య, ఎల్‌వీ సుబ్బయ్య, రఫీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం మరొకరికి ప్రాణదానం

గూడూరు, ఫిబ్రవరి 19: రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేసినట్లవుతుందని ఎంవీఐ సునీల్ అన్నారు. సోమవారం పోటుపాళెంలోని రవాణాశాఖ కార్యాలయంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. డ్రైవర్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ నిబంధనలకు లోబడి వాహనాలను నడిపితే ప్రమాదాలు జరగవన్నారు. అతివేగంతో, మద్యంసేవించి వాహనాలను నడపడం ద్వారా ప్రమాదాలు జరుగుతాయన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లపైనే ఉందన్నారు. జాగ్రత్తలు పాటిస్తూ వాహనాలను నడిపి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎంవీఐ అనిల్‌కుమార్, ఆర్టీసీ డీఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



రక్తాదాన శిబిరంలో రవాణశాఖ అధికారులు